బుధవారం
26-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 303
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఫాసిజం నుంచి మానవాళిని కాపాడండి!

బెలారస్ రాజధాని మిన్స్క్ నగరంలో అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఫోరంలో ఆసియా, అమెరికా, యూరప్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. యుద్ధం వద్దు! నయా ఫాసిజం అణచివేతను వ్యతిరేకించండి. వారు విడుదల చేసిన మేనిఫెస్టోలో ఈ కింది అంశాలు ఉన్నాయి.

2లో

పంట పరిహారమేది?

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:

మార్చిలో కురిసిన అకాలవర్షాల కారణంగా చేతికొచ్చిన పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే పంటనష్టాన్ని అంచనా వేసి రైతులకు సహాయం చేస్తున్నామని చెపుతున్న రాష్ట్ర ప్రభుత్వం... నెల దాటినా నష్టపరిహారం ఇవ్వలేదు. పరిహారం ఎప్పుడిస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి కనిపిస్తోంది. అధికార యంత్రాంగం సైతం సమాధానం చెప్పలేని స్థితిలో ఉంది. అకాల వర్షాల కారణంగా కృష్ణా, గుంటూరు, గోదావరి డెల్టా ప్రాంతాల్లో కోతకొచ్చిన వరి పంట దెబ్బతింది. కోతలు కోసిన పనలు నీటమునిగి మొలకలెత్తగా, కోతకు వచ్చిన వరి పనలు నేలకొరిగి నీట నానాయి. అప్పటికే కోసి కల్లాల్లో ఆరబెట్టిన వేలాది టన్నుల ధాన్యం తడిసిపోయింది. ధాన్యం కొనుగోలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో చాలావరకు ధాన్యం కల్లాల్లోనే ఉండిపోయింది. పక్వానికొచ్చిన మొక్కజొన్న పంట నేలకొరిగి నాశనమైంది. ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో మిరప పంట పెద్దమొత్తంలో దెబ్బతింది. అసలే అధిక

అకాలవర్షాలకు 2లక్షల ఎకరాల్లో పంట నష్టం

ఆపన్నహస్తం కోసం అన్నదాత ఎదురుచూపు

పెట్టుబడితో కూడిన మిరప పంటకు ఈ ఏడాది తామరపురుగు సోకి నాశనం చేసింది. దీని నివారణ కోసం రైతులు సాధారణం కంటే రెట్టింపుస్థాయి పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏ పురుగు మందు కొడితే ఈ వైరస్ నివారించబడుతుందో వ్యవసాయాధికారులు సైతం చెప్పలేని పరిస్థితి నెలకొనడంతో దాదాపు అన్ని రకాల పురుగుమందులు పిచికారి చేసి ప్రయోగాలు చేశారు. ఫలితంగా పెట్టుబడులు తడిసి మోపెడయ్యాయి. వీటన్నింటినీ తట్టుకుని కొద్దోగొప్పో పండిన మిర్చి...ఈదురుగాలుల దాటికి తట్టుకోలేక నేల రాలింది. పూత, పిందె, కాయ రాలిపోయింది. అరటి, మామిడి రైతులకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది అధిక మంచు కారణంగా మామిడి పూత రాలిపోయి దిగుబడి గణనీయంగా పడిపోయింది. దీనికితోడు ఈదురుగాలులు, అకాలవర్షాలు తోడు కావడంతో మామిడి నష్టం అంచనాలకు అందనంతస్థాయిలో రైతును చావుదెబ్బతీసింది. అన్ని రకాల పంటలు బాగా దెబ్బతిన్నాయి. కాగా, బాధితులకు నష్టపరిహారం తక్షణమే అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కూడా దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శికి లేఖ రాశారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, రబీ ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతుకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందజేయాలని, మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50వేల పరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు. క్యుములోనింబస్ మేఘాల కారణంగా పిడుగులు పడి రాష్ట్రవ్యాప్తంగా మృతి చెందిన ఏడు కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

అవినాశ్ పిటిషన్‌పై వీడని ఉత్కంఠ

విచారణ నేటికి వాయిదా

గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై కూడా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి :

వైఎస్ వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ వ్యవహారంపై ఉత్కంఠ కొనసాగుతోంది. దీనిపై తెలంగాణ హైకోర్టులో విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఈనెల 25వ తేదీ వరకు అవినాశ్‌రెడ్డిని అరెస్ట్ చేయవద్దంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై వివేకా కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించడం, దానిపై సీజేఐ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేస్తూ 11 పేజీలతో సుదీర్ఘ తీర్పునిచ్చింది. అవినాశ్‌రెడ్డికి మధ్యంతర బెయిల్ మంజూరుపై, తెలంగాణ హైకోర్టు వైఖరిని సీజేఐ ధర్మాసనం తప్పుబట్టింది. కేసు దర్యాప్తు దశలో ఉండగా హైకోర్టు జోక్యం అవాంఛనీయమని సుప్రీం అభిప్రాయపడింది. సీబీఐ దర్యాప్తును నీరుగార్చేలా హైకోర్టు ఉత్తర్వులున్నాయని, నిందితుడ్ని విచారించే విషయంలో ఉత్తర్వులు ఇచ్చిన తీరు ఏమాత్రం బాగాలేదని సీజేఐ ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. నేర చట్టాలను తిరగరాసే విధంగా హైకోర్టు ఉత్తర్వులు ఉండటం శోచనీయమని సీజేఐ తీర్పులో పేర్కొంది. సీబీఐ అఫిడవిట్‌లోని అంశాలను తప్పుగా అన్వయించుకుని హైకోర్టు అసాధారణ ఉత్తర్వులు జారీ చేసిందని సీజేఐ ధర్మాసనం వ్యాఖ్యానించింది. చివరకు ఈ ఒక్కరోజైనా అవినాశ్‌రెడ్డిని అరెస్ట్ చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని అవినాశ్ తరపు న్యాయవాది కోరగా, దానికి కూడా నిరాకరిస్తూ దీనిపై తెలంగాణ హైకోర్టునే ఆశ్రయించాలని సూచించింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, వాదనలు బుధవారం వింటామని

- మిగతా 2 లో



నేడు ఇంటర్ ఫలితాలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి:

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలను బుధవారం సాయంత్రం 5 గంటలకు విడుదల చేస్తారు. 22 రోజుల వ్యవధిలో ఇంటర్ పరీక్ష ఫలితాలను ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించనుంది. ఈ విడత ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలు ఒకేసారి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడిస్తారు. మార్చి 15న ఇంటర్ ప్రథమ సంవత్సరం, 16న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమైన విషయం విదితమే. పరీక్షల ప్రక్రియ ఏప్రిల్ 4తో ముగిసింది. ఇంటర్ పరీక్షలకు మొత్తం 10,03,990 మంది హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలకు మొత్తం 4.84 లక్షల మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సర పరీక్షలకు 5.19 లక్షల మంది హాజరయ్యారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,489 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫలితాలను ఇంటర్మీడియట్ బోర్డు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

పంజాబ్ మాజీ సీఎం ప్రకాశ్‌సింగ్ బాదల్ కన్నుమూత

పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ సీనియర్ నేత ప్రకాశ్ సింగ్ బాదల్ కన్నుమూశారు.కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన...మంగళవారం రాత్రి 8:28 గంటలకు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు.

8 లో

ప్రతిపక్ష ఫ్రంట్‌కు కేసీఆర్‌కు అడ్డల్లా రాహులే

హైదరాబాద్:

మోదీని గద్దె దించడానికి విశాలమైన ప్రతిపక్ష వేదిక ఏర్పాటుకు తాను వ్యతిరేకం కాదని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు అంటున్నారు. అయితే 2024లో ప్రతిపక్షాలు గెలిస్తే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థి కావడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నారు. కేసీఆర్ జాతీయ రాజకీయాలలో కీలక పాత్ర పోషించడానికి కొంత కాలంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఎన్‌సీపీ నాయకుడు శరద్ పవార్ లాంటి వారిని కలుసుకుంటూనే ఉన్నారు. అయితే మోదీని ఢీకొనడానికి ఆయన ఏర్పాటు చేయదలచుకున్న ఫ్రంట్ బీజేపీయేతర, కాంగ్రెసేతర ఫ్రంట్‌గా ఉండాలనుకుంటున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ తన కూతురు కవితను ప్రశ్నిస్తున్న నేపథ్యంలో కేసీఆర్. ఇతర

- మిగతా 2 లో

బీజేపీపై పోరులో కలిసిరండి

ధర్మవరం ప్రచారభేరి సభలో రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర–ధర్మవరంటౌన్:

వైషమ్యాలతో మతసామరస్యాన్ని బీజేపీ ప్రభుత్వం నాశనం చేస్తోందని, మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టంచేశారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపేంతవరకు పోరాటాలు ఆపబోమని తేల్చిచెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద సీపీఐ, సీపీఎం అధ్వర్యాన ప్రచారభేరి బహిరంగసభ మంగళవారం జరిగింది. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం–దేశాన్ని కాపాడుకుందాం అని రామకృష్ణ పిలుపునిచ్చారు. బహిరంగ సభకు అధిక సంఖ్యలో వచ్చిన చేనేత కార్మికుల్ని రామకృష్ణ ఆప్యాయంగా పలకరించారు. రామకృష్ణ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలపై ధర్మవరంలో సీపీఐ ఇటీవల భారీ ఆందోళన చేపట్టిందని గుర్తు చేశారు. దీనివల్ల అధికారుల్లో కదలిక వచ్చిందని చెప్పారు. చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేంతవరకు నిరంతర పోరాటం సాగిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రచార భేరి మోగిస్తున్నామని, మే తర్వాత ప్రజలందరినీ కలుస్తామని తెలిపారు. బీజేపీ మత సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించుకోవడంలో ప్రజల సహకారం అవసరమని రామకృష్ణ కోరారు. రైతులు, చేనేత కార్మికులు ఆకలిచావులకు గురవుతున్నా జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బుధవారం నాటి ముఖ్యమంత్రి అనంతపురం పర్యటనను అడ్డుకుంటామని లేదా సమస్యలను విన్నవిస్తామని తెలిపారు. తమది పేదల ప్రభుత్వమని పదేపదే చెప్పుకునే ముఖ్యమంత్రి...పేదలకు ఏమి చేశారని నిలదీశారు. అప్పులు ఇబ్బడిముబ్బడిగా తెచ్చిన ప్రభుత్వం...లబ్ధిదారులకు మాత్రం కొద్దిమొత్తమే ముట్టచెబుతోందని, మిగిలిన డబ్బు ఏమి చేస్తున్నదని రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్లు లేవు. ప్రాజెక్టులు నిర్మించలేదు. కాలువలు తవ్వలేదని విమర్శించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు రాకపోగా...ఉన్నవి వెళ్లిపోతున్నాయని చెప్పారు. నాలుగేళ్లయినా మాజీమంత్రి వివేకానందారెడ్డి హత్యకేసును సీబీఐ తేల్చలేకపోయిందని, వివేకను ఎవరు చంపారో సీఎం జగన్‌కు తెలియదా అని ప్రశ్నించారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, మతసామరస్యం, సమాఖ్యస్ఫూర్తిని బీజేపీ దెబ్బతీస్తోందని రామకృష్ణ మండిపడ్డారు. దేశ సంపదను కొద్దిమంది కుబేరులకు దోచిపెడుతోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించకపోతే ప్రజలు మరిన్ని కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణానికి నిధులు, విశాఖ ఉక్కు తదితర విషయాల్లో రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించకూడదని సూచించారు.

దళితులపై దాడులు జరుగుతున్నా జగన్ ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని రామకృష్ణ అన్నారు. ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేనేత కార్మికులకు ఏమి చేశారని ప్రశ్నించారు. మే 8 తేదీన ధర్మవరంలో ఇంటింటా తిరిగి చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏపీ చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు, కౌలు, రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ ఇన్చార్జ్ మధు, సీపీఎం

- మిగతా 2 లో

పోలవరం కుడి కాలువ అక్రమ తవ్వకాల వ్యవహారం జలవనరుల అధికారులపై హైకోర్టు ఆగ్రహం

- వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశం
- జూన్ 22న తదుపరి విచారణ

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి:

పోలవరం కుడి కాలువ అక్రమ తవ్వకాలపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని పిల్లి సురేంద్ర బాబు హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై గతంలో హైకోర్టులో విచారణ జరగ్గా, తవ్వకాలు నిలిపివేయాలని సీజే ధర్మాసనం ఆదేశించింది. అయినప్పటికీ అక్రమ తవ్వకాలు ఆగకపోవడంపై హైకోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఈ మధ్య మన 'ఫ్యాన్' కి అస్తమానూ రిపేర్లే సార్, సరిగా తిరిగి చావటంలేదు!

శిక్ష నిలిపివేయండి

పరువు నష్టం కేసులో గుజరాత్ హైకోర్టుకు రాహుల్

అహ్మదాబాద్:

పరువు నష్టం కేసులో తనకు విధించిన శిక్షను నిలిపివేయాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంగళవారం గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. తన స్టే పిటిషన్‌ను సూరత్ సెషన్స్ కోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'మోదీ' ఇంటిపేరుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో సూరత్ కోర్టు.. రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ గతంలో తీర్పు చెప్పిన విషయం తెలిసిందే. 'దొంగలందరికీ మోదీ అనే ఇంటిపేరే ఎందుకు ఉంటుందో?' అని 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కర్నాటకలోని కోలార్‌లో రాహుల్ వ్యాఖ్యానించారని గుజరాత్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీ సూరత్ కోర్టులో పరువునష్టం కేసు పెట్టారు. దీనిపై విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు రాహుల్‌కు రెండేళ్ల శిక్ష

- మిగతా 2 లో

జగన్ ప్రభుత్వానికి సమాధి కడదాం

రోడ్ షోలో చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర–అమరావతి:

రాష్ట్రాభివృద్ధిని సర్వనాశనం చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సహకరించాలని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాలు తప్ప రాష్ట్ర ప్రయోజనాలపై జగన్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. జగన్ రూపంలో రాష్ట్రానికి పట్టిన కర్మను ఓటు అనే ఆయుధంతో తరిమికొట్టేందుకు ప్రతి కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందని విజ్ఞప్తి చేశారు. అమరావతి మండల పరిధిలోని వైకుంఠపురం, మద్దూరు, అమరావతి గ్రామాలలో చంద్రబాబు మంగళవారం సాయంత్రం రోడ్ షో నిర్వహించారు. జగన్ రాష్ట్రానికి పట్టిన దరిద్రమని చంద్రబాబు మండిపడ్డారు. జగన్ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించారు. పాలన చేతకాని జగన్ వల్ల రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందని చెప్పారు. తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టుకోవాలంటే టీడీపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని చంద్రబాబు ఉద్ఘాటించారు. రాజధానిని జగన్ చంపేశాడని, పోలవరం ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే చందంగా మారిందని విమర్శించారు. రోడ్లు లేవు. ప్రాజెక్టులు లేవు. నవరత్నాల పేరుతో మీట నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదని విరుచుకుపడ్డారు. రాష్ట్రానికి పునర్వైభవం తీసుకురావాలంటే టీడీపీ

- మిగతా 2 లో

ఫాసిజం నుంచి మానవాళిని కాపాడండి!

ప్రపంచ ప్రజల ఐక్యతకు మేనిఫెస్టో

బెలారస్ రాజధాని మిన్స్క్ నగరంలో అంతర్జాతీయ ఫాసిస్టు వ్యతిరేక ఫోరంలో ఆసియా, అమెరికా, యూరప్ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. యుద్ధం వద్దు! నయా ఫాసిజం అణచివేతను వ్యతిరేకించండి. వారు విడుదల చేసిన మేనిఫెస్టోలో ఈ కింది అంశాలు ఉన్నాయి.

బెలారస్ గడ్డపై మేము సమావేశమవుతున్నాం. నాజీ దురాక్రమణకు బెలారస్‌లో ప్రతి ముగ్గురిలోనూ ఒకరు చనిపోవడమో, క్రూరహింసకు బలవడమో జరిగింది. కేపిటలిజం సంక్షోభం నుంచి నాజీయిజం తలెత్తింది. తమ స్వార్థపూరిత ప్రయోజనాలకు సామ్రాజ్యవాదులు ఆ చీకటి శక్తులను బలపరిచారు. హిట్లర్, ముస్సోలిని, ఫ్రాంకో తదితరులు అధికారంలోకి వచ్చారు. కోట్లాది ప్రజల భవిష్యత్‌ను వారి చేతుల్లో పెట్టారు.

ఫాసిజం పోరాటంలో గడించిన అనుభవాలను ప్రజలు ఎన్నటికీ మరువలేరు. 1936లో స్పెయిన్‌లో అంతర్యుద్ధం జరిగింది. దానికి నాజీ జర్మనీ, ఫాసిస్టు ఇటలీ పూర్తి మద్దతిచ్చాయి. సోవియట్ యూనియన్ ఇతర ప్రగతిశీల శక్తులు... రిపబ్లిక్ శక్తులకు సహాయాన్ని అందజేశాయి. కానీ ఫాసిజం బలమైన శక్తిగా ఆవిర్భవించింది. మానవజాతి చరిత్రలో ఇది భయంకరమైన యుద్ధం. బుహేన్ వాల్డ్, ఆస్విట్జ్, డచ్వో మృత్యుశిబిరాలుగా మారాయి.

ఫాసిజాన్ని ఓడించేందుకు ప్రపంచ ప్రజలు భారీ మూల్యాన్ని చెల్లించారు. సోవియట్ రెడ్‌ఆర్మీ, చైనా ప్రజా విముక్తి సైన్యం, ఫ్రెంచ్-ఇటాలియన్ ప్రతిఘటనా శక్తులు, యుగస్లోవియా -కొరియా పార్టిజాన్లు, పోలిష్-చెకోస్లోవేకియా దేశభక్తులు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించి ఫాసిజం వ్యతిరేక పోరాటాల్లో పాల్గొన్నారు. 1945 మే నెల్లో జర్మన్ పార్లమెంట్ భవనం రీచ్‌స్టాగ్‌పై ఎర్రజెండా ఎగురవేశారు.

గత శతాబ్దం 30వ దశకంలో ఈ కార్చిచ్చు వ్యాపించింది.

నేటి పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నది. ఆఫ్రికా-అమెరికా ఖండాలలో నయా వలసవాదం తలెత్తింది. ఆసియాలో సామ్రాజ్యవాదులు ఉద్రిక్తతలను రెచ్చగొడుతున్నారు. యూరప్, ఇతర ప్రాంతాల్లోనూ మంటలు చెలరేగుతున్నాయి. రక్తం ప్రవహిస్తోంది. ప్రజల వ్యతలు వర్ణనాతీతంగా మారాయి. మన కళ్లెదుటే ఘోరాలు జరిగిపోతున్నాయి. తల్లుల కన్నీళ్లు కలచివేస్తున్నాయి.

ఫాసిజాన్ని ఓడించిన సోవియట్ యూనియన్ నేడు విధ్వంసానికి గురైంది. ప్రపంచ దోపిడీదారుల పథకాలు ఫలించాయి. నియంతృత్వాన్ని రుద్దారు. ఫాసిస్టు ప్రమాదం రోజురోజుకూ పెరుగుతోంది.

ఈ గ్లోబల్ దుష్టశక్తి నయా ఉదారవాద ముసుగులో నేడు తలెత్తింది. యావత్ దేశాల ప్రజలను, వనరులను కొల్లగొడుతున్నారు. యుగస్లోవియా, ఇరాక్, అఫ్ఘానిస్తాన్, లిబియా, సిరియాలకు వ్యతిరేకంగా దురాక్రమణలకు పాల్పడ్డారు. వెనిజులా, నికరాగ్వే, బెలారస్‌లో ప్రభుత్వాలను కూల్చివేసే పథకాలను రూపొందించారు. రష్యా, చైనా, క్యూబా, ఉత్తర కొరియా ప్రజలకు వ్యతిరేకంగా ఆంక్షలు విధించారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో రెచ్చిపోయిన హిట్లర్ మూకలు కొత్త రూపాల్లో విరుచుకుపడ్డాయి. ఈ భూమండలం నుంచి ఆ శక్తులు అదృశ్యం కాలేదు. బాల్టిక్ దేశాల్లో నాజీ కిరాతకులు భయంకర ప్రదర్శన నిర్వహిస్తున్నారు.

ఉక్రెయిన్‌లో నాజీ భావజాలం ప్రభుత్వ భావజాలంగా మారింది. అమెరికా, నాటో దేశాల పూర్తి మద్దతు దానికున్నది. ఉక్రెయిన్‌లో నిర్బంధశిబిరాలు వెలిశాయి. ప్రతిపక్షాలను నిషేధించారు. కమ్యూనిస్టులపై నిర్బంధకాండ కొనసాగుతోంది. కొన్ని ప్రాంతాల్లో ప్రజలను సజీవదహనం చేస్తున్నారు.

పశ్చిమ దేశాల ప్రభుత్వాలు ఉక్రెయిన్ నాజీలకు ఆయుధాలకు దండిగా సరఫరా చేస్తున్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అణ్వాస్త్రాల కోసం ఉవ్విళ్లూరుతున్నారు. ప్రమాదకరమైన హెచ్చరికలు లండన్ నుంచి వస్తున్నాయి. నయా నాజీ ప్రభుత్వానికి మారణాయుధాలను లండన్ నుంచి సరఫరా చేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా నాటో దేశాల సైనిక స్థావరాలు ఏర్పాటయ్యాయి. వివిధ దేశాల్లో అమెరికాకు చెందిన 400 బయో ల్యాబరేటరీలను ఏర్పాటు చేశారు. యావత్ మానవాళికి ప్రమాదం ముంచుకొస్తోంది.

కమ్యూనిస్టులు మొదటి నుంచి హెచ్చరిస్తూనే ఉన్నారు. 'ఫాసిజం అంటే యుద్ధం', దానికి ఒకే ఒక్క సమాధానం ఉన్నది. ఫాసిస్టు రక్కసిని ఓడించాలి! నిర్లక్ష్యం కూడదు! మరొక యుద్ధం జరగరాదు!

అనేక దేశాల్లో నియంతృత్వశక్తులు అధికారంలోకి వచ్చాయి. వీటి వెనుక అంతర్జాతీయ ద్రవ్య-ఆర్థిక ప్రభువుల ప్రయోజనాలు ఉన్నాయి.

కుహనా మేధావుల పరిశోధనలకు వీటి నుంచి మద్దతు లభిస్తున్నది. నిషే సిద్ధాంతాలను వ్యాపింపజేస్తున్నారు. చాంబర్లైన్ జాత్యాహంకార సిద్ధాంతాలను తలకెత్తుకున్నారు. సామాజికాభివృద్ధి కంటే సాంకేతికాభివృద్ధి గొప్పదని చాటుతున్నారు. మానవతావాదానికి వక్రబాష్యం చెబుతున్నారు. హిట్లర్ పాతభావాలను మరో రూపంలో బలపరుస్తున్నారు. మానవాళిని నియంత్రించి తమ అధీనంలో ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నారు.

నయా ఉదారవాదం దేశాల స్వతంత్రాభివృద్ధిని, ప్రజాస్వామ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తోంది. పశ్చిమ దేశాల రాజకీయ వ్యవస్థ నిరంకుశ వ్యవస్థలుగా మారాయి. స్వేచ్ఛ-స్వాతంత్ర్యాలు, మానవతావాద విలువలకు వీరు వ్యతిరేకం. నయా ఫాసిజం ముంచుకొస్తోంది. హిట్లర్, ముస్సోలిని, ఫ్రాంకో, సాలజార్, క్విస్లింగ్, మ్యానర్‌హీమ్ వారసులు తయారయ్యారు. 'నూతన ప్రపంచ వ్యవస్థ'కు పథకాలను రూపొందించారు. నూతన ప్రపంచ యుద్ధం ప్రమాదం ముంచుకొస్తున్నది. దురాక్రమణలు, సంఘర్షణలు, నయా ఫాసిజం, నయా వలసవాదం- ఇవి ప్రపంచ యుద్ధ ప్రమాదానికి సూచికలు. యావత్ ప్రపంచమే ఒక యుద్ధ రంగంగా మారింది. ఈ పోరాటంలో మనం గెలవాలి. మానవాళి ఉజ్వల భవిష్యత్‌ను కాపాడాలి. అంతర్జాతీయ సంఘీభావాన్ని సమీకరించాలి. బెలారస్ నుంచి... ఆ పవిత్ర భూమి నుంచి మేము విజ్ఞప్తి చేస్తున్నాం. గతం, వర్తమానం, భవిష్యత్తు విడదీయరానివి.

ప్రియమైన మిత్రులారా!

రెండవ ప్రపంచ యుద్ధంలో కమ్యూనిస్టులు, దేశభక్తులు, ప్రజాస్వామ్యవాదుల పొత్తు ఏర్పడింది. సామాజిక భావజాల విభేదాలు ఉండవచ్చు. రాజకీయ మత దృక్పథాలు వేరుగా ఉండవచ్చు. ఐక్య కార్యాచరణకు కదిలి వద్దాం. నయా నాజిజం, సైనికవాదం వ్యతిరేకంగా ఐక్యపోరాటానికి ముందుకెళదాం. ప్రగతిశీలశక్తుల ఐక్యత వర్ధిల్లాలి!

ఉద్యోగ వ్యతిరేక విధానాలు విడనాడాలి

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

విశాలాంధ్ర-గుంటూరు: బీఎస్ఎన్ఎల్ గుంటూరు బిజినెస్ ఏరియా జీఎం ఉద్యోగ వ్యతిరేక విధానాలు విడనాడాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఏయూఏబీ అధ్వర్యంలో గుంటూరు చంద్రమౌళినగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో రెండవ రోజు మంగళవారం కొనసాగిన ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలను ఏయూఏబీ రాష్ట్ర చైర్మన్, ఎన్ఎఫ్‌టీఈ రాష్ట్ర కార్యదర్శి కె.అంజయ్య, ఏయూఏబీ రాష్ట్ర కన్వీనర్, బీఎస్ఎన్ఎల్ ఈయూ రాష్ట్ర కార్యదర్శి పి.రమాదేవి ప్రారంభించారు.

దీక్షకు సంఘీభావం తెలిపిన వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఇష్టానుసారం ఉద్యోగులను బదిలీలు చేయడం, వేధింపులకు పాల్పడటం వంటి చర్యల వలన బీఎస్ఎన్ఎల్‌కు నష్టం జరుగుతుందని, దాని ఫలితం ప్రజలకు అందించే సేవలపై పడుతుందని అన్నారు. ఇప్పటికైనా జీఎం విజ్ఞతతో ఆలోచన చేసి తన విధానాలు మార్చుకోవాలని, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఏఐజీఈటీఓఏ రాష్ట్ర నాయకులు ఫజిల్ అహ్మద్, శ్రీనివాసరావు, విజయవాడ నాయకులు ఎం.విజయ్‌కుమార్, పి.శ్రీనివాసరావు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ కోటేశ్వరరావు, రత్తయ్య, ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి హనుమంతరెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. జీఎం చర్యలను ఖండించారు. రెండవ రోజు 30 మంది ఉద్యోగులు, 25 మంది విశ్రాంత ఉద్యోగులు నిరాహార దీక్షలో కూర్చున్నారు. ఎన్ఎఫ్‌టీఈ జిల్లా కార్యదర్శి గంటా నాగేశ్వరరావు, బీఎస్ఎన్ఎల్ ఈయూ జిల్లా కార్యదర్శి సురేశ్, ఏఐజీఈటీఓఏ జిల్లా కార్యదర్శి ప్రకాశ్, ఎస్ఈడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సూడాన్ నుంచి తెలుగువారు వెనక్కి

తరలింపు ఏర్పాట్లపై అధికారులకు సీఎం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అంతర్యుద్ధం కారణంగా సూడాన్‌లో చిక్కుకున్న తెలుగువారిని రక్షించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుని వారిని సురక్షితంగా వెనక్కి రప్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. స్వదేశానికి రాగానే వారిని స్వస్థలాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

ఉక్రెయిన్ సంక్షోభం సమయంలో వ్యవహరించిన మాదిరిగానే, సూడాన్‌లో చిక్కుకున్న వారికి విమాన టిక్కెట్లు, ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని, ఎయిర్‌పోర్టు నుంచి స్వస్థలాలకు చేరుకునేవరకూ అండగా నిలవాలని సీఎం ఆదేశించారు. సూడాన్‌లో 56 మంది తెలుగువారున్నట్లు తెలిసిందన్నారు.

షర్మిలకు బెయిల్...

హైదరాబాద్: వైఎస్ఆర్‌టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల చంచల్ గూడ జైలు నుంచి విడుదలయ్యారు. షర్మిలకు మంగళవారం మధ్యాహ్నం నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పోలీసులపై దాడి కేసులో షర్మిలను సోమవారం అరెస్ట్ చేసిన పోలీసులు... సాయంత్రం నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో వైఎస్ షర్మిలకు ఈ ఏడాది మే 8వ తేదీ వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే షర్మిల తరపు న్యాయవాది వెంటనే బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఉదయం నాంపల్లి కోర్టులో వైఎస్ షర్మిల తరపు న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు పూర్తయ్యాక కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేయగా షర్మిల జైలు నుంచి విడుదలయ్యారు.

తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ ఏం చేశారు?

బంగారు తెలంగాణ తెస్తానని చెప్పిన సీఎం కేసీఆర్... తొమ్మిదేళ్లలో ఏం చేశారని షర్మిల ప్రశ్నించారు. జైలు నుంచి విడుదలైన ఆమె ఇంటికి చేరుకోగానే మీడియా సమావేశంలో మాట్లాడారు. అసలు పాలన చేతనైందా? కేసీఆర్ ఎన్నడైనా సెక్రటేరియట్‌కు వెళ్లారా అని ప్రశ్నించారు. రుణమాఫీ, సున్నా వడ్డీకే మహిళలకు రుణాలు, ఇంటికొక ఉద్యోగం, నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం ఇళ్లు, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇవేమీ అమలు చేయలేదని, ఇచ్చిన వాగ్దానం ఒక్కటి కూడా నిలబెట్టుకోలేదని ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అవినీతి చేయడం మాత్రమే కేసీఆర్‌కు చేతనైందని, వేలకోట్లు దోచుకున్నారని, రియల్ ఎస్టేట్ చేయడం కేటీఆర్‌కు చేతనైందని, లిక్కర్ స్కామ్‌కు పాల్పడటం కూతురు కవితకు చేతనైందని షర్మిల ఆరోపించారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

సీపీఐ బృందం డిమాండ్

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం: విద్యుదాఘాతందో మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీహెచ్ కోటేశ్వరరావు, కౌలు రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంచల జమలయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి పరిధిలోని లంక భూముల్లో నిరుపేద దళితులకు చెందిన పదెకరాల మొక్కజొన్న పంట విద్యుదాఘాతానికి గురై పంట పూర్తిగా దగ్ధమైంది. సీహెచ్ కోటేశ్వరరావు, పంచల జమలయ్య, రైతుసంఘం జిల్లా కన్వీనర్ మల్నీడి యల్లమందరావు, సీపీఐ మైలవరం నియోజకవర్గం కార్యదర్శి బుడ్డి రమేశ్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, స్థానిక సీనియర్ నాయకులు జొన్నలగడ్డ కోటేశ్వరరావు, కౌలురైతులతో కలిసి పంట దగ్ధమైన లంక భూముల్లో మంగళవారం పర్యటించారు. దగ్ధమైన పంటపొలాలను పరిశీలించారు. బాధిత రైతులను పరామర్శించారు. చేతికొచ్చిన పంట అగ్నికి ఆహుతైందని, తామెలా కోలుకోవాలని నాయకుల ముందు రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ఎకరానికి రూ.80 వేల నుండి లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టామని, మద్దతు ధర 1962 రూపాయలు ఉంటే కేవలం 1700 రూపాయలకే అడుగుతున్నారని వాపోయారు. మొదట్లో 2400 ధర ఉంటే ఇప్పుడు అతి తక్కువ ఉందని తెలిపారు. ఈ దశలో పంట మొత్తం తగలబడి బూడిదైందని రైతులు రెంటపల్లి కోటేశ్వరరావు, చిన్న బాబురావు, మరియదాసు, అన్నారావు నాయకులతో చెప్పి బోరుమన్నారు. కమ్యూనిస్టు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దళిత రైతాంగానికి ఎకరానికి రెండు లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించి తక్షణమే ఆదుకోవాలని, తక్షణ ఉపశమనంగా ఎకరానికి లక్ష చొప్పున సాయమందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఇక చట్టసభలకు నాయీబ్రాహ్మణులు

ప్రభుత్వ సలహాదారు సజ్జల వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నాయీబ్రాహ్మణులకు చట్టసభల్లో స్థానం కల్పించాలని జగన్ ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నాయీబ్రాహ్మణుల కృతజ్ఞతా సభ జరిగింది. సజ్జలతోపాటు రాష్ట్ర మంత్రులు జోగి రమేశ్, కొట్టు సత్యనారాయణ, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, వైసీపీ అనుబంధ సంఘాల రాష్ట్ర కో-ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ నేతలు హాజరయ్యారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి, జ్యోతిరావుపూలే, ధన్వంతరీ చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. సజ్జల మాట్లాడుతూ జగన్ పాదయాత్ర సమయంలో అనేక ప్రాంతాలలో నాయీబ్రాహ్మణులు కలిశారని, తమ సాధకబాధకాలు ఆయనకు చెప్పుకున్నారన్నారు. వాటన్నింటినీ గుర్తుంచుకున్న జగన్...ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటీ నెరవేర్చుకుంటూ వచ్చారన్నారు. సమస్యల పరిష్కారం కోసం చంద్రబాబు దగ్గరకు వెళ్తే తోకలు కత్తిరిస్తానంటూ బెదిరించి హేళనగా మాట్లాడిన విషయాన్ని మరిచిపోలేని నాయీబ్రాహ్మణులు...జగన్ చూపుతున్న ఆదరాభిమానాలకు హర్షం తెలుపుతున్నారన్నారు. జగనన్న చేదోడు ద్వారా నాయీబ్రాహ్మణులకు ఇప్పటికి మూడు విడతల్లో పదివేల చొప్పున 30 వేల రూపాయలు అందించారని, వృత్తిదారులకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారని వివరించారు. నాయీబ్రాహ్మణులను కించపరిచే పదాలను నిషేధిస్తూ అలా అవమానించిన వారిని జైలుకు పంపేలా జీవో-50 తీసుకొచ్చారన్నారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులంటే సమాజానికి సేవకులే కాదు...పాలకులని నిరూపించేలా సీఎం జగన్ కృషి చేస్తున్నారని కొనియాడారు. మంత్రులు జోగి రమేశ్, కొట్టు సత్యనారాయణ, వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల పట్ల చంద్రబాబు చాలానిర్దయగా, నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయ పర్యవేక్షకులు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల కార్యక్రమం అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత జర్నలిస్టులకు గౌరవం

కొమ్మినేని శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశ్రాంత సీనియర్ జర్నలిస్టులను రాష్ట్ర ప్రభుత్వం తరపున గౌరవించడం సంప్రదాయమని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. ఎన్టీఆర్‌జిల్లా కాసరనేనివారిపాలెం గ్రామంలో వారి స్వగృహంలో ఆ గ్రామ సర్పంచ్ పెద్ది వరప్రసాద్‌తో కలిసి మంగళవారం ఉపేంద్రబాబు, పద్మ దంపతులను రాష్ట్ర ప్రభుత్వం తరపున శాలువాతో సత్కరించి, మెమొంటో అందజేశారు.

కొమ్మినేని మాట్లాడుతూ విశ్రాంత జీవనం గడుపుతున్న సీనియర్ జర్నలిస్టులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం తరపున వారి ఇంటికే వెళ్లి గౌరవిస్తున్నామన్నారు. నాటికాలం జర్నలిజం విలువలు నేటి తరానికి స్ఫూర్తి నివ్వాలని, అందుకు సీనియర్ పాత్రికేయుల్ని గౌరవించడం సంప్రదాయంగా తాము ప్రారంభించి కొనసాగిస్తున్నామని వివరించారు. జర్నలిజం రంగంలో సుదీర్ఘకాలం పనిచేసి స్వగ్రామంలో కాలం గడుపుతున్న తమను రాష్ట్ర ప్రభుత్వం మీడియా అకాడమీ ద్వారా గుర్తించి, గౌరవించినందుకు గారపాటి ఉపేంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

తమ అనుభవాలను చైర్మన్‌తో ఉపేంద్రబాబు పంచుకున్నారు. చాలాకాలంగా సమాజానికి దూరంగా ఉంటున్న తమ వద్దకు మీడియా అకాడమీ చైర్మన్ రావడం, తమను గౌరవించడం సంతోషంగా ఉందన్నారు. సీఆర్ మీడియా అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాలగంగాధర తిలక్, కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక ట్వెల్త్ టాపర్‌గా 'హిజాబ్' బాలిక

బెంగళూరు: కర్నాటకలో గతేడాది జరిగిన హిజాబ్ పోరాటంలో ఓ బాలిక అందరి దృష్టిని ఆకర్షించింది. హిజాబ్ ధరించడం కోసం అల్లరి మూకలతో ధైర్యంగా పోరాడి సామాజిక మాధ్యమాలతో పాటు అన్ని చోట్లా వైరలైన ఓ విద్యార్థిని ఇప్పుడు 12వ తరగతిలో టాపర్‌గా నిలిచింది. ్దువు కోసం తాను చేసిన పోరాటం వృథా కాలేదని నిరూపించింది. కర్నాటక క్లాస్ 12 ఫలితాల్ని ప్రకటించగా 600 మార్కులకు 593 మార్కులు సాధించిను 'హిజాబ్' బాలిక సత్తా చాటింది. ఆమె పేరు తబస్సుమ్. ఈ విజయం గురించి మాట్లాడుతూ, బాగా చదువుకుంటే భవిష్యత్‌లో ఇటువంటి అన్యాయాలను ఎదిరించగలవని తల్లిదండ్రులు చెప్పారని, వారిచ్చిన ధైర్యంతో చదువులో రాణించగలిగానని విద్యార్థిని తెలిపింది. టాపర్‌గా నిలవడంతో తనకున్న కలల్లో ఒకటి సాకారం అయిందని చెప్పింది. ఐదేళ్ల నుంచి హిజాబ్ ధరిస్తున్నానని, అదే నేడు తన గుర్తింపుగా మారిందని తబస్సుమ్ తెలిపింది.

బీజేపీపై పోరులో కలిసిరండి

(మొదటిపేజీ తరువాయి)

నాయకులు పెద్దన్న, రైతుసంఘం జిల్లా కార్యదర్శి రమణ, సీఐటీయూ జిల్లా నాయకులు అయూబ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, రాజా, సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి రమణ, రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుళ్లాయప్ప, కనగానపల్లె మండల కార్యదర్శి మహాదేవ్, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేశ్, ముదిగుబ్బ మండల కార్యదర్శి శీను, వెంకటేశ్, చేనేత కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పోతులయ్య, కార్యవర్గ సభ్యులు విజయభాస్కర్, అధిక సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

దాఖలైంది. ఈ పిటిషన్‌పై మంగళవారం ధర్మాసనం విచారణ చేసింది. పిటిషనర్ తరపున న్యాయవాది పాలేటి ఉమా మహేశ్వరరావు వాదనలు వినిపించారు. హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి అక్రమ తవ్వకాలు చేస్తున్న దృశ్యాలను న్యాయవాది కోర్టు ముందు ఉంచారు. తవ్వకాలు నిలిపివేయాలని కోర్టు ఆదేశించినప్పటికీ తవ్వకాలు జరపడంపై కోర్టు సీరియస్ అయ్యింది. జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, చీఫ్ ఇంజినీర్ వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను జూన్ 22కు వాయిదా వేసింది.

ఎమ్మెల్సీ అనంత్‌బాబు కేసుపై వేసవి సెలవుల తర్వాత విచారణ

ఎమ్మెల్సీ అనంత్ బాబు కేసును సీబీఐకి అప్పగించాలని న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం కోర్టు విచారణ చేసింది. దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసింది. సీబీఐ దర్యాప్తుకు ఇచ్చే అంశంలో తన వాదనలు వినాలంటూ ఎమ్మెల్సీ అనంత్ బాబు ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో వేసవి సెలవుల తర్వాత వాదనలు వింటామని హైకోర్టు తెలిపింది.

శిక్ష నిలిపివేయండి

(మొదటిపేజీ తరువాయి)

విధించింది. అలాగే పై కోర్టులో సవాల్ చేసేందుకు 30 రోజుల గడువు ఇచ్చింది. అప్పటి వరకు బెయిల్ మంజూరు చేసింది. ఇదే క్రమంలో రాహుల్‌పై ఎంపీగా అనర్హత వేటు పడింది. అనంతరం రాహుల్ గాంధీ సూరత్ సెషన్స్ కోర్టును ఆశ్రయించారు. రెండేళ్ల జైలు శిక్షను నిలుపుదల చేయాలని, తనను దోషిగా తేలుస్తూ ఇచ్చిన తీర్పును సైతం నిలిపివేయాలని రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ఏప్రిల్ 3న విచారణ చేపట్టిన కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది. తదుపరి విచారణలో భాగంగా ఏప్రిల్ 13న రెండు పక్షాల వాదనలు విని 20వ తేదీన తీర్పు వెలువరించింది. తాజా తీర్పును సవాల్ చేస్తూ రాహుల్ గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు.

అవినాశ్ పిటిషన్‌పై వీడని ఉత్కంఠ

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ హైకోర్టు తెలిపింది. ఇక ఇదే కేసులో ఏ-1గా ఉన్న ఎర్ర గంగిరెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌పై కూడా తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఎర్ర గంగిరెడ్డి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సీబీఐ వాదించింది. కాగా బెయిల్ రద్దుకు బలమైన కారణాలేమీ లేవని ఎర్ర గంగిరెడ్డి తరపు న్యాయవాది వాదించారు. గంగిరెడ్డి బెయిల్ రద్దు చేయాలన్న సీబీఐ పిటిషన్‌పై విచారణ కూడా బుధవారానికి వాయిదా పడింది.

జగన్ ప్రభుత్వానికి సమాధి కడదాం

(మొదటిపేజీ తరువాయి)

అధికారంలోకి రావాల్సిందేనని వక్కాణించారు. కాగా, చంద్రబాబుకు ప్రజలు అడుగడుగునా నీరాజనాలు పలికారు. సైకిల్ రావాలి...సైకో పోవాలి అంటూ నినదించారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యేలు కొమ్మాలపాటి శ్రీధర్, యరపతినేని శ్రీనివాసరావు, టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు తదితరులు చంద్రబాబుకు స్వాగతం పలికారు.

ప్రతిపక్ష ఫ్రంట్‌కు కేసీఆర్‌కు అడ్డల్లా రాహులే

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాలతో కలిసి నడవక తప్పదనుకుంటున్నారు. కానీ రాహుల్‌ను ప్రతిపక్ష కూటమిగా అంగీకరించడానికి మాత్రం సిద్ధంగా లేరు. ఎందుకంటే తెలంగాణలో కాంగ్రెసే తమ పార్టీకి ప్రధాన ప్రత్యర్థి అన్నది ఆయన అంచనా. కూతురుకు వచ్చిన కష్టం నుంచి గట్టెక్కాలంటే ఇతర ప్రతిపక్షాల దన్ను తప్పనిసరి అన్న ఇంగిత జ్ఞానం కేసీఆర్‌కు దండిగానే ఉంది. రాహుల్ నాయకత్వమే ఆయన దృష్టిలో అడ్డంకిగా ఉన్నట్టుంది. మోదీని ఓడించడానికి అన్ని ప్రతిపక్ష పార్టీలూ ఏకం కావాలని చిత్తశుద్ధితో ప్రయత్నిసున్నది కొన్ని పార్టీలైతే బీజేపీకి, కాంగ్రెస్ కు అతీతమని మరో ప్రతిపక్ష కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్న వారు మరి కొందరు. ఆ కొందరిలో తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్ర శేఖర రావు ప్రముఖుడు.

ప్రభుత్వంపై పోరుబాట

రైతుసంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

ముదునూరు ఆర్బీకే వద్ద రైతుల ఆందోళన

విశాలాంధ్ర-ఉయ్యూరు: రైతుల్ని చిన్నచూపు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఇక పోరుబాట తప్పదని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ హెచ్చరించారు. ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంపై ఆగ్రహించిన రైతులు మంగళవారం ఉయ్యూరు మండలం ముదునూరు రైతుభరోసా కేంద్రానికి తాళాలు వేసి ఆందోళన నిర్వహిం చారు. జవర్లపూడి, రసాయిపురం, బోళ్ళపాడు, వెంట్రప్రగడ రైతులు తమ ధాన్యాన్ని ముదునూరు రైతు భరోసా కేంద్రం (ఆర్బీకే) ద్వారా విక్రయించుకుంటున్నారు. ఆందోళనలో పాల్గొన్న కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ... ఈ క్రాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతుల నుంచి కొంతవరకు ధాన్యాన్ని సేకరించారు. 118 రైతులుకు 21,242 బ్యాగ్‌లను సిద్ధం చేసి సేకరించినప్పటికీ ఆఫ్‌లైన్ ద్వారా సేకరించిన ధాన్యానికి నగదు చెల్లింపులు జరగలేదని, సిబ్బంది అక్రమాలతో కావాల్సిన వారికి అనువుగా నమోదు చేశారని కేవీవీ ప్రసాద్ అన్నారు. ఆన్‌లైన్‌లో .. 44మంది రైతులు నమోదు చేసుకున్నప్పటికీ 481.74 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాల్సి ఉన్నప్పటికీ లక్ష్యం పూర్తయిందని కేంద్రం సిబ్బంది చేతులెత్తేశారని, ఇప్పటికి 100 మంది పైగా రైతులు ధాన్యం కొనుగోలుకు కల్లాల మీద, బస్తాలలో రోడ్లు మీద ఉంచారన్నారు. మరోపక్క చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని మంత్రి గోవర్ధన్ కల్లబొల్లి మాటలు చెబుతున్నారన్నారు. ఆఫ్‌లైన్ లోనే సిబ్బందే అవకతవకలకు పాల్పడ్డారని, దీనిపై కలెక్టర్, సివిల్ సప్లై ఎండీకి ఫిర్యాదు చేస్తామని ఏపీ కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, సిబ్బంది అక్రమాలపై రైతులు నినాదాలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పూర్తిగా చినిగిపోయిన సంచులను ఏర్పాటు చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు వెలగపూడి ఆజాద్, నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, రైతు సంఘం నేత అన్నే సుబ్బారావు పాల్గొన్నారు. కాగా విజయవాడలోని సివిల్ సప్లై ఆఫీసు వద్ద బుధవారం ముదునూరు బాధితరైతులు ఆందోళన చేపట్టనున్నారు. తమ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం అధ్వర్యంలో వినతి పత్రాన్ని ఎండీ వీరపాండియన్ కు సమర్పించనున్నారు.

ఈ ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు

అమరావతి జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొప్పరాజు

విశాలాంధ్ర-కాకినాడ: ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించడంలో విఫలమైన రాష్ట్రప్రభుత్వానికి పాలించే అర్హత లేదని అమరావతి జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. అమరా వతి జేఏసీ అధ్వర్యంలో మంగళవారం ఉదయం కాకినాడలో ధర్నా చౌక్ సెంటర్ వద్ద నిరసన ధర్నా జరిగింది. ముఖ్య అతిథులుగా బొప్పరాజు తో పాటు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ... ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆదాయం లక్ష కోట్ల రూపాయల యితే ఉద్యోగులకే రూ. 90 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం దారుణమని విమర్శించారు. వలం టీర్ల జీతాలతో పాటు ఏపీ ఉద్యోగులకు చెల్లించే మొత్తం రూ.60 వేల కోట్లకు మించి ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు ఉద్యోగు లకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులందరూ నిర్లక్ష్యం వహించకుండా ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమంలో పాలుపంచు కోవాలని బొప్పరాజు వెంకటేశ్వర్లు పిలుపిచ్చారు. ఉద్య మించకుంటే ప్రతి ఉద్యోగి తగిన మూల్యం చెల్లించు కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే జీతాలు సరైన సమయానికి పడక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈనెల 28న రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాలని బొప్పరాజు పిలుపు నిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా చిత్తశుద్ధితో ఈ నెల 28 తేదీలోపు ఉద్యోగ సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు.

కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసేవరకు ఉద్యమం: రావుల రవీంద్రనాథ్

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ... ఈ రాష్ట్రంలో 22 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పని చేస్తున్నారని, వీరందర్నీ క్రమ బద్ధీకరణ చేస్తామని, జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి... ఆ పని ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం ఇచ్చిన హామీని ఎప్పుడు నెరవేరుస్తారా అని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్ కార్మికులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయడం లేదని, కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మి నెంట్ చేసే వరకు ఏఐటీయూసీ ఇతర సంఘాలను కలుపుకుని ఐక్య కార్యచరణ పోరాటాలు కొనసాగి స్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూ లంగా స్పందించకుంటే 2024లో జరిగే ఎన్నికల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల తగిన గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్లు, ప్రభుత్వ డ్రైవర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

కస్తూర్బా ఉపాధ్యాయులకు వేతనాలేవీ: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కస్తూర్బా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు రెండు నెలలుగా వేతనాలు జాప్యం చేస్తే... వారు కుటుంబాల్ని ఎలా పోషించుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అమరావతిలోని రాష్ట్ర ఖజానా కార్యాలయ సంచాలకులు ఎన్.మోహన్‌రావుకు మంగళవారం ఎస్టీయూ నేతలు వినతిపత్రం అందజేశారు. తిమ్మన్న మాట్లాడుతూ... గురుకుల, కస్తూర్బా పాఠశాలల ఉపాధ్యా యులకు ఫిబ్రవరి, మార్చి వేతనాలు ఇంతవరకు చెల్లించ కపోవడం అత్యంత బాధ్యతా రాహిత్యమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రెండు నెలలుగా జీతాలు చెల్లించకుంటే ఆ ఉపాధ్యాయులు వారి కుటుంబాలను ఎలా పోషించుకోవాలి? బ్యాంకు రుణాల నెలసరి వాయిదాలు ఏ విధంగా చెల్లించుకోవాలో ఖజానా అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నెలసరి వాయిదాలు చెల్లించకుంటే సంబంధిత బ్యాంకు అధికారులు ఉపాధ్యాయులకు పెనాల్టీ నోటీసులు పంపిస్తున్నారని, దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలన్నారు. విద్యాశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పుస్తకాలు అందలేదని, పుస్తకాలను పూర్తిస్థాయిలో విద్యార్థులు రాయలేదనే కారణంతో ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రతినెలా ఒకటో తేదీ వేతనాలు పొందడం ప్రభుత్వ ఉద్యోగి చట్టపరమైన హక్కు అని, అవేమీ ప్రభుత్వం అదనంగా ఇచ్చే సంక్షేమ పథకాలు కాదన్నారు. దీనిపై రాష్ట్ర ఖజానా కార్యాలయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు స్పందిస్తూ... కొత్త ఆర్థిక సంవత్సరం కావడంతో బడ్జెట్ విడుదల చేయడానికి సమయం పడుతుందని, త్వరలోనే వారి పెండింగ్ జీతాలు చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తిమ్మన్న తెలిపారు.

9న ఈఏపీసెట్ హాల్ టికెట్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రి కల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్)-2023 హాల్ టికెట్లను మే 9వ తేదీ నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచు తారు. ఈనెల 15వ తేదీతో ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ముగిసింది. ఇప్ప టికీ దరఖాస్తు చేయలేని వారి కోసం రూ.500 అపరాధ రుసుముతో ఈనెలాఖరు వరకు గడువు పొడిగించారు. ఈఏపీసెట్‌ను ఆంధ్రాలోని అన్ని ముఖ్య నగరాల్లోను, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లోను ఆన్‌లైన్ విధానంలో నిర్వహి స్తారు. ఈ ఏడాది ఈఏపీసెట్‌ను జేఎన్‌టీయూ- అనంతపురం నిర్వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో సెట్ల విభాగానికి వెళ్లి పూర్తి వివరాలను పొందవచ్చని ఏపీ ఈఏపీసెట్ కన్వీనర్ తెలిపారు. ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారికి వారి ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో సీట్లను భర్తీ చేస్తారు. ఇంజినీరింగ్ విభాగంలో బీటెక్, బీటెక్- బయోటెక్నాలజీ, డైరీ టెక్నాలజీ, అగ్రికల్చర్ విభాగంలో బీఎస్సీ(ఏజీ), బీఎస్సీ(హాన్స్), బీవీఎస్సీ అండ్ ఏ హెచ్/బీఎఫ్ఎస్సీ కోర్సులకు ర్యాంకుల ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఫార్మసీ విభాగంలో బి.ఫార్మసీ, ఫార్మాడి కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఏడాది నుంచి ఈఏపీసెట్ ర్యాంకుల కేటాయింపులో ఇంటర్ మార్కులకూ వెయిటేజీ ఇస్తారు. ఈఏపీసెట్ పరీక్షలను మే 15 నుంచి 23 వరకు నిర్వహిస్తారు. ప్రతి రోజూ రెండు సెషన్లుగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు నిర్వహిస్తారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించాలి

- ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి
- మే 3న రాస్తారోకో జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ యత్నాలను తక్షణం విరమించుకో వాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి డిమాండ్ చేసింది. ఇందుకోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మే 3న రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జరిగే రాస్తారోకోల్లో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని సమితి పిలుపు నిచ్చింది. మంగళవారం విజయవాడలోని ప్రెస్‌క్లబ్ లో సమితి అధ్వర్యంలో రైతు సంఘాలు, ప్రజా సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 32 మంది బలిదానంతో తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేయాలని కేంద్రం నిర్ణయించడం దుర్మార్గమన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ కార్మిక వర్గం నేటికి 803 రోజులుగా పోరాటం సాగిస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పాల్గొని 13 జిల్లాల్లో మే మూడవ తేదీన రాస్తారోకో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ... విశాఖ ఉక్కు 2022 వరకు ఏటా రూ.950 కోట్లు లాభాన్ని అర్జించిందని, ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వానికి రూ.50వేల కోట్లు, రాష్ట్ర ప్రభుత్వానికి రూ.15 వేల కోట్లు పన్నుల రూపంలో చెల్లించిందని చెప్పారు. ఏపీకి మణిహారంగా ఉన్న విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు వై. కేశవరావు మాట్లాడుతూ... స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం 26 వేల ఎకరాల భూమిని 16,500 మంది రైతులు ఇచ్చారని, అందులో నిర్వాసితులకు ఇంకా 8600 మందికి ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. ఈ ప్లాంట్‌కు సంబందించి రూ.మూడు లక్షల కోట్ల ఆస్తిని కేవలం 30 వేల కోట్లు... అంటే కేవలం బుక్ విలువకు ప్రైవేటు కంపెనీలకు దారాదత్తం చేయటానికి కేంద్రం ప్రయత్నం చేయటం దారుణమన్నారు. కరోనా సమ యంలో స్టీల్ ప్లాంట్ కార్మికులు 150 మంది చనిపోయినా కూడా మొక్కవోని దీక్షతో కార్మికులు పనిచేసి ప్లాంట్ నుంచి వేల టన్నుల మెడికల్ ఆక్సిజన్ ను ఉత్పత్తి చేసి దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ప్రజలను కాపాడారని,అట్లాగే రైతులకు అవసరమైన పుష్కల్, అమోనియం సల్ఫేట్, మందులకు అవసరమైన నైట్రోజన్, బెంజాల్,నెఫ్టాలియన్ నేటికీ ఉత్పత్తి చేస్తూనే ఉన్నారని తెలిపారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపి దానిని కొనసాగించడానికి అవసరమైన ఐదువేల కోట్ల రూపాయలు వెంటనే అప్పుగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యదర్శి వి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది కేవలం రూ.5200 కోట్లేనని, గత 35 ఏళ్లుగా సొంత గనులు ఇవ్వమని కార్మికులు కోరుతూనే ఉన్నారని, అది పట్టించుకోక పోగా... 100% ఉత్పత్తి చేయడానికి గాను అవసరమైన ముడి సరుకు సరఫరా చేయడానికి ఆసక్తి కలవారిని టెండర్లు వేయమని కోరడం దారుణం అన్నారు. మే 3న రాస్తారోకో ఆందోళనను జయప్రదం చేయడానికి రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలను, లారీ అసోసియేషన్, ప్రజా సంఘాలను కలిసి వారి మద్దతు కోరాలని సమవేశం నిర్ణయించింది.ఈ సమావేశంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జమలయ్య, ఏఐకేఎఫ్ అధ్యక్షుడు మర్రెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి కుర్రా నరేంద్ర, చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుండపునేని ఉమా వరప్రసాద్, జాగృతి రైతు సంఘం అధ్యక్షుడు మరీదు ప్రసాదు బాబు, వివిధ రైతు సంఘాల నాయకులు ఎం.హరిబాబు, వి. ఆజాద్, జొన్న శివశంకర్, గుంటక రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని గద్దె దించుదాం

సగర, ముదిరాజ్, సూర్యబలిజ సమావేశంలో కొల్లు రవీంద్ర పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీసీలను దగా చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అందరూ ఐక్యం కావాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు నిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహిం చిన సగర/ఉప్పర, ముదిరాజ్, సూర్యబలిజ సాధికార కమిటీ సభ్యుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రవీంద్ర మాట్లాడుతూ నాలుగేళ్ల జగన్ పాలనలో బీసీలు అత్యంత దుర్భర పరిస్థితులు ఎదుర్కొం టున్నారన్నారు. 56 కార్పొరేషన్ల పేరుతో హడావుడి చేసి, చైర్మన్లు, డైరెక్టర్లను నియమిం చినట్లు చెబుతున్న జగన్ రెడ్డి ఆయా కార్పొరేషన్ల ద్వారా ఎంత ఖర్చు చేశారన్న ప్రశ్నకు సమాధానం చెప్పడం లేదన్నారు. బీసీలకు చెందిన 28 పథకాలు రద్దు చేశారని, చివరకు కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా పథకాలు దూరం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో బీసీల కోసం నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించిన బీసీ భవన్‌లు, కమ్యూనిటీ హాళ్లు, దోబీ ఘాట్లు, సొసైటీ బిల్డింగులను నాలుగేళ్లుగా పూర్తి చేయకుండా పాడుబెట్టారన్నారు. విదేశీ విద్య, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, స్టడీసర్కిళ్లు, పెళ్లి కానుకలు, ఆదరణ వంటి పథకాలన్నీ రద్దు చేసి దగా చేశారని విమర్శించారు. బీసీలను ఓటర్లుగానే చూస్తూ, వారి దయా దాక్షిణ్యాలపై ఆధారపడేలా చేస్తున్న జగన్ రెడ్డిని సాగనంపే వరకు తెలుగుదేశం పార్టీ, బీసీ విభాగం అలుపెరుగక శ్రమిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాలెడ్జి సెంటర్ చైర్మన్ గురజాల మాల్యాద్రి, బీసీ సెల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గంజాం రాఘవేంద్ర, సగర సాధికార కమిటీ కన్వీనర్ జంపన శ్రీనివాస్, ముదిరాజ్ సాధికార కమిటీ కన్వీనర్ పీఎల్ రావు, సూర్య బలిజ సాధికార కమిటీ కన్వీనర్ రాళ్లకొట్టు రాము, విశ్వబ్రాహ్మణ సాధికార కమిటీ కోఆర్డినేటర్ సింహాద్రి కనకాచారి, సగర ముదిరాజు సూర్య బలిజ సాధికార కమిటీల కోఆర్డినేటర్ కడలి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. కమిటీలో సభ్యులుగా చేరిన వారితో కొల్లు రవీంద్ర ప్రమాణ స్వీకారం చేయించారు.

టీడీపీతోనే సీమ అభివృద్ధి

నారా లోకేశ్ ఉద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: వైసీపీ ప్రభుత్వంపై తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విరుచుకుపడ్డారు. యువగళం పేరుతో 80వ రోజు పాద యాత్రలో భాగంగా కర్నూలు జిల్లా కోసిగిలో స్థానిక రేణుక ఎల్లమాంబ దేవాలయం వద్ద మంగళవారం భారీ బహిరంగ సభ జరిగింది. మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి తిక్కారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, యువ నాయకులు దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. లోకేశ్ మాట్లాడుతూ కోసిగి సమీపాన గల పులికనుమ ప్రాజెక్టుకు టీడీపీ ప్రభుత్వంలో 80 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసి ప్రత్యేక కాలువ తవ్వామన్నారు. రాయలసీమ అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, రాబోయే రోజుల్లో రాయలసీమలో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు. కోసిగి మండలంలో వలసల నివారణకు పరిశ్రమలు స్థాపిస్తా మన్నారు. మంత్రాలయం నుంచి మూడుసార్లు ఎన్నికైన బాలనాగిరెడ్డి ఏ ఒక్క అభివృద్ధి పని చేయలేదన్నారు. బాలనాగిరెడ్డిని విషనాగిరెడ్డిగా అభివర్ణించారు. విషనాగిరెడ్డి కర్నాటక మద్యాన్ని యథేచ్ఛగా అమ్ముతు న్నారని, పెద్దఎత్తున ఇసుక అమ్ముకుంటూ అవినీతికి పాల్పడుతు న్నారన్నారు. రైతుల నుంచి చౌకగా భూములు కొని ప్రభుత్వానికి లక్షల రూపా యలకు అమ్ముకున్నారని తెలిపారు. మంత్రాలయంలో అభివృద్ధి తెలుగుదేశం హయాంలోనే జరిగిందన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతోందని, వైసీపీ చేతకాని ప్రభుత్వంగా మిగిలిందన్నారు. త్వరలో జగన్ జైలుకు వెళతా రన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. లోకేశ్ పాదయాత్రకు జననీరాజనం పలికారు. మహిళలు మంగళ హారతులిచ్చారు. గొరవయ్యల నృత్యం, డప్పు కళాకారులు, డ్రమ్స్‌తో కోసిగి మండలం దద్దరిల్లిపోయింది.

భూ సర్వేలో జేసీలదే కీలక భూమిక

సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భూసర్వే ఫలాలు ప్రజలకు చేర్చ డంలో జాయింట్ కలెక్టర్లు కీలక భూమిక పోషించాల్సి ఉందని ముఖ్య మంత్రి ముఖ్య సలహాదారు అజేయ కల్లం అన్నారు. రాష్ట్రంలో చేపట్టిన భూముల రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారుల కోసం తాడేపల్లిలోని విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం వేదికగా నిర్వహించిన భూసర్వే పునశ్చరణ సదస్సును ఆయన మంగళవారం ప్రారంభించారు. అజేయ కల్లం మాట్లాడుతూ ప్రజాసేవతో ప్రజల మనస్సులో అధికారులు సుస్థిర స్థానం సంపాదించుకోగలుగుతారన్నారు. ముఖ్యమంత్రి మానస పుత్రికగా ప్రారంభమైన వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా నిరంతర సమన్వయం, ప్రత్యక్ష పర్యవేక్షణ అవసరమని సూచించారు. భూపరిపాలన చీఫ్ కమిషనర్ సాయిప్రసాద్ మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా భూముల రీసర్వే చేపట్టడం ద్వారా ఆ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోషాలకు తావులకుండా...ఎ వరూ వేలెత్తి చూపని రీతిలో భూసర్వే పూర్తి చేయాలన్నారు. భూపరిపాలన, సర్వే సెటిల్‌మెంట్ కమిషనర్ సిద్ధార్థ జైన్ మాట్లాడుతూ భూసర్వే ఫలితంగా అత్యధిక సంఖ్యలో గ్రామ సర్వేయర్లను నియమించి...వారికి 82 రకాల రీసర్వే శిక్షణ ఇవ్వడం ద్వారా శాఖను మరింత పటిష్టపరచుకోగలిగామని చెప్పారు. మానవవనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అధునాతన సాంకేతిక సర్వే పరిజ్ఞానం వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని, సర్వేయర్లకు డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఒక రోజు పునశ్చరణ సదస్సులో సర్వే, సరిహద్దు చట్టంపై సిద్ధార్థ జైన్ అవగాహన కల్పించగా, ఆర్ఓఆర్ చట్టం, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలపై అదనపు సీసీఎల్ఏ ఎండీ ఇంతియాజ్ వివరించారు. పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్య కుమారి, సర్వేశాఖ అదనపు సంచాలకులు రోణంకి గోపాలకృష్ణ స్వమిత్ర కార్యక్రమం గురించి దిశానిర్దేశం చేశారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకటే శ్వరరావు కార్స్, రోవర్స్ అంశాలను విపులీకరించగా, సర్వే ఐటీ కార్యక్రమాలపై రచనలు చేశారు. సర్వే అకాడమీ వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ఎస్ వీఎస్ కుమార్, కాకినాడ ఆర్డీడీ కెజియా, కేంద్రకార్యాలయం డీడీ ఝాన్సీరాణి పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించండి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గ్రామ పంచా యతీ ల్లోని స్వచ్ఛభారత్ విభాగపు గ్రీన్ అంబా సిడర్ల సమస్యల్ని తక్షణమే పరిష్క రించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. రాష్ట్ర పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్‌కు ఏఐటీ యూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీరాములు, నాయకులు సి.పుల్లారావు తదితరులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చలసాని రామారావు మాట్లాడుతూ... 2022 జనవరి 13వ తేదీన స్వచ్ఛ భారత్ కార్మికులకు రూ.6 వేల నుంచి రూ.10వేల వేతనం పెంచుతూ ప్రభుత్వం జీవో 680 విడుదల చేసిందని గుర్తుచేశారు. జీవో విడుదల చేసి 25 నెలలు గడుస్తున్నా ఇంకా అమలుకు నోచుకోలేదని, నెలకు రూ.6వేలు, రోజుకు రూ. 200 చొప్పున ఇస్తున్నారని వివరించారు. రోజు రోజుకూ నిత్యవసర ధరలు విపరీతంగా పెరుగుతున్నా యని, ఇచ్చే రూ.6వేలతో ఒక కుటుంబం ఎలా కాలం గడుస్తుందనే విషయాన్ని ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు పని విభజన లేకుండా ఉందని, ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారులు చెప్పిన పని చేస్తున్నారని వివరించారు. కరోనాని సైతం లెక్క చేయకుండా తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి, వీధులు శుభ్రపరచి, పాజిటివ్ కేసుల దగ్గర బ్లీచింగ్ చల్లారని గుర్తుచేశారు. కరోనాలోనూ వారు కష్టపడినా వారిని కరోనా వారియర్ల కింద లెక్క పెట్టకపోవటం దారుణమన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీరాములు మాట్లాడుతూ జీవో నెంబర్ 680 అమలు చేయాలని, స్వచ్ఛ భారత్ కార్మికులకు పనిభద్రత కల్పించి, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, రాజకీయంగా ఎవరిని తొలగించడానికి వీల్లేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల యూనియన్ వినుకొండ సమితి సభ్యులు వందనం, జీవరత్నం, బెన్నీ, గురుస్వామి, సుదర్శన్ పాల్గొన్నారు.

'అకడమిక్ కన్సల్టెంట్ల పొడిగింపు దారుణం: శివారెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీవెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో అకడమిక్ కన్సల్టెంట్లను వచ్చే విద్యా సంవత్సరానికి యథావిథిగా పొడిగించాలని యూని వర్సిటీ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో అకడమిక్ కన్సల్టెంట్ల నియామకాలలో రూల్ ఆఫ్ రిజర్వేషన్, సీనియారిటీలను పట్టించుకోలేదని, దీనివల్ల అర్హులు రోడ్డున పడ్డారని తెలిపారు. ఎకడమిక్ కన్సల్టెంట్లను ఈ ఏడాది కూడా పొడిగించకుండా రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 110 ప్రకారం కాంట్రాక్టు పద్ధతిలో విద్యాలయాలలో ప్రొఫెసర్ నియామకాలు చేపట్టాలని కోర్టులు చెబుతున్నా... యూనివర్సిటీ అధికారులు పెడచెవిన పెట్టడం సిగ్గుచేటు అని శివారెడ్డి మండిపడ్డారు. నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

చెరువుకట్ట పనులు పరిశీలించిన ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

విశాలాంధ్ర-బుక్కపట్నం: సత్య సాయి జల్లా బుక్క పట్నం మండల పరిధిలోని గూనిపల్లి గ్రామంలో మంగ ళవారం ప్రపంచ బ్యాంకు ప్రతిని ధుల బృందం చెరువు కట్ట మరమ్మతు పనులను పరి శీలించారు. 83 లక్షల రూపాయల ప్రపంచ బ్యాంకు నిధులతో చేపడుతున్న చెరువు కట్ట మరమ్మతు పనుల్ని ప్రతినిధులు శాంతను, వెంకట, షాగున్, రంజన్ పరిశీలిస్తున్న సందర్భంలో గ్రామానికి చెందిన రైతులు... తమ పట్టా భూములలో కొంతమేర నిర్మాణ పనులు చేపట్టారని కాంట్రాక్టర్ తమకు నష్టపరిహారం అందేలా హామీ ఇచ్చిన తమను మోసం చేశారని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. అదేవిధంగా చెరువులో నీరు నిల్వ ఉండకుండా చెరువు దిగువ ఉన్న హంద్రీనీవా కాలువలోకి చెరువులోని నీరు వెళ్లిపోయినట్లయితే కట్టవల్ల ప్రయోజనం లేకుండా పోతుందని రైతులు వివరించారు. అయితే రైతుల సమస్యల్ని పట్టించుకోని ప్రపంచబ్యాంకు ప్రతినిధులు తమ పని ముగించుకొని వెనుతిరిగారు. ఈ కార్యక్ర మంలో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ రాఘవయ్య, ఇరిగేషన్ ఎస్ ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈ ఈ నారాయణ నాయక్, వాటర్ రిసోర్స్ ఆఫీసర్ గంగాధర్, ఇరిగేషన్ జేఈలు సుధాకర్ రాజు, జమున భాయ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంపాదకీయం

రాజకీయ కుస్తీలో మల్ల యోధులు చిత్తు

విశ్వ క్రీడావేదిక అయిన ఒలింపిక్స్ క్రీడల్లో కుస్తీ పోటీలు పెట్టి పతకాలు సాధించడం పరిశ్రమ, సంకల్పబలం ఉంటే సులభం కావచ్చు. కానీ రాజకీయ నాయకులతో తలపడడం ఎంతటి మల్ల యోధులకైనా కష్టసాధ్యమే. అదీ ఆ రాజకీయ నాయకులు అధికార పార్టీకి చెందిన వారైతే, దానికి తోడు పార్లమెంటు సభ్యుడైతే ఆ వ్యక్తి ఎంత నైచ్యానికి పాల్పడినా తలపడడం సులభం కాదు. ఇక ఆ రాజకీయ నాయకుడు అధికార పార్టీకి చెందిన వాడైతే ఎన్ని ఫిర్యాదులు చేసినా అరణ్యరోదనగానే మిగిలిపోతాయి. ఒలింపిక్ క్రీడల్లో పతకాలు సంపాదించిన వారు, జాతీయ చాంపియన్ షిప్ పథకాలు సాధించిన వారైనా వినిపించుకునే నాథుడే ఉండడు. పతకాలు సాధించిన మల్ల యోధులు ఉమ్మడిగా భారత కుస్తీ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌కు వ్యతిరేకంగా రోడ్డెక్కి దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన తెలియజేస్తున్నారు. ఇంతకు ముందు కూడా వీరు నిరసన గళాలు వినిపించినా పట్టించుకున్న వారు లేకపోవడంతో మళ్లీ గత ఆదివారం నుంచి నిరసన ప్రారంభించారు. అనేక మంది మల్ల యోధులు ఈ నిరసనోద్యమంలో భాగస్వాములయ్యారు. భారత మల్లయోధుల సంఘాల సమాఖ్యకు అధ్యక్షుడిగా వెలిగిన బ్రిజ్ భూషణ్ పై పోరాటం ప్రారంభించారు. ఆ పెద్దమనిషి రాజకీయ అండచూసుకుని మల్ల యుద్ధంలో పాల్గొంటున్న మహిళలపై లైంగిక అత్యాచారానికి పాల్పడ్డారన్న తీవ్ర ఆరోపణలున్నాయి. తమకు న్యాయం జరిగే దాకా పోరాటం కొనసాగిస్తామని వారు అంటున్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతున్నప్పుడు ప్రపంచ ఛాంపియన్ వినేశ్ ఫోగాట్, ఒలంపిక్ పతక విజేత సాక్షి మాలిక్ కళ్లనీళ్ల పర్యంతం అయ్యారు. వీరు గత జనవరిలో నిరసన తెలియజేసినప్పుడు రాజకీయ నాయకులను దరి చేర నివ్వలేదు. మద్దతు తెలియజేద్దామనుకున్న సీపీఎం నాయకురాలు బృందా కరత్‌ను వేదిక మీంచి దింపేశారు. ఇప్పుడు బీజేపీ సహా ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా మద్దతు ఇవ్వొచ్చునంటున్నారు. ఇటీవలి కాలం దాకా కాంగ్రెస్ నాయకుడిగా, మాజీ న్యాయశాఖ మంత్రిగా, ప్రస్తుతం ఇన్సాఫ్ కె సిపాహీ అన్న సంస్థను నడుపుతున్న కపిల్ సిబాల్ ఈ మల్ల యోధులకు మద్దతు ప్రకటించారు. అలాగే హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హూడా, అఖిలభారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్టా డి సౌజా, కాంగ్రెస్ నాయకుడు ఉదిత్ రాజ్ లాంటి వారు జంతర్ మంతర్ లోని నిరసన శిబిరం దగ్గరకు వెళ్లి అండగా నిలబడ్డారు. మల్ల యోధుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ మాత్రమే కాక వీరికి శిక్షణ ఇచ్చే వారు కూడా ఇలాగే లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారట. ఏడుగురు మల్ల యోధులు మంగళవారం ఉమ్మడిగా సుప్రీంకోర్టులో ఒక అర్జీ దాఖలుచేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ తో కూడిన ఇద్దరు సభ్యుల బెంచి వీరి పిటిషన్‌ను విచారణకు స్వీక రించింది. వచ్చే శుక్రవారం విచారణ జరుగుతుంది. వీరు కోరిందల్లా బ్రిజ్ భూషణ్ పై ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయాలనే. అంటే గత జనవరిలోనే ఈ అంశం వెలికి వచ్చినప్పటికీ బ్రిజ్ భూషణ్ పై ఎఫ్.ఐ.ఆర్. అయినా దాఖలు కాలేదంటే రాజకీయ నాయకుల భల్లూకపు పట్టు ఎంత తీవ్రమైందో అర్థం చేసుకోవచ్చు. బ్రిజ్‌భూషణ్ చేతిలో లైంగికవేధింపునకు గురైన అమ్మాయిల్లో ఒకరి వయసు ఆ సంఘటన జరిగినప్పుడు కేవలం పదహారేళ్లే అని కపిల్ సిబ్బల్ అత్యున్నత న్యాయస్థానానికి నివేదించారు. ఆ అమ్మాయి బంగారు పతకం సాధించింది. బ్రిజ్‌భూషణ్ మీద వచ్చిన ఆరోపణలు తీవ్రమైనవని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. బ్రిజ్‌భూషణ్‌పై ఎఫ్.ఐ.ఆర్. దాఖలు చేయనందుకు పోలీసులమీద ఇంతవరకు ఎందుకు చర్య తీసుకోలేదు అన్న ప్రశ్నకు ఆయన బీజేపీ నాయకుడు కావడమే అన్న సమాధానమే వస్తుంది.

అలసట లేకుండా "బేటీ బచావో బేటీ పఢావో" అని నినాదాలిచ్చే ప్రధానమంత్రి మోదీ చెవికి జంతర్ మంతర్‌లో పిక్కటిల్లుతున్న నిరసన ధ్వనులు వినిపించలేదేమో. వినిపించినా ఏ ముఖ్యమైన అంశంపైనైనా మౌనం పాటించడం ఆయన విశిష్ట శైలి. దేశ విదేశాల్లో భారత కీర్తి పతాకాన్ని సమున్నతంగా ఎగురవేస్తున్న ఈ మల్లయోధులకు నెలలు గడిచినా న్యాయం జరగకపోవడం క్రీడా రంగంలోనూ రాజకీయాల ప్రభావ తీవ్రతకు సంకేతం. వీరు పతకాలు సాధించినప్పుడు రాజకీయ నాయకులు పోటీ పడి అభినందన సందేశాలు గుప్పిస్తుంటారు. లైంగిక దాడికి గురై ఫిర్యాదు చేసిన ఏడుగురు అమ్మాయిల మీద బ్రిజ్ భూషణ్ పై ఇచ్చిన ఫిర్యాదు వెనక్కు తీసుకోవాలన్న ఒత్తిడి పెరుగుతోంది. మరీ విచిత్రం ఏమిటంటే ఫిర్యాదు వెనక్కు తీసుకుని, ఆందోళన మానుకుంటే డబ్బు ముట్ట చెప్తామని మల్ల యోధుల సంఘాల సమాఖ్యకు చెందిన వారు నిస్సిగ్గుగా ప్రలోభ పెడ్తున్నారు. ఇంతకు ముందు వీరు ఆందోళనకు దిగినప్పుడు ఇచ్చిన హామీలు ఏవీ నెరవేరలేదు. ప్రభుత్వం నియమించిన కమిటీ నివేదికైనా సమర్పించలేదు. దీనికి కారణం ఆరోపణలకు గురైంది బీజేపీ నాయకుడు కావడమే.

ఏ క్రీడా సంఘమైనా రాజకీయ నాయకుల ఆధిపత్యంలోనే ఉన్నప్పుడు రాజకీయాలకు అతీతమైన పోరాటం దుర్లభమే. గత జనవరిలో ఈ అమ్మాయిలు నిరసనకు దిగినప్పుడు బ్రిజ్ భూషణ్ మీద వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి కమిటీ నియమిస్తామంటే ఆందోళన విరమించారు. ఇంతవరకు తమ ఫిర్యాదుపై ఒక్క అడుగు కూడా ముందుకు పడనందువల్ల మళ్లీ ఆందోళన ప్రారంభించక తప్పలేదు. లైంగిక వేధింపులకు గురైన ఈ మల్లయోధులు గత మూడు నెలలుగా అనిర్వచనీయమైన మానసిక వ్యథ అనుభవిస్తున్నారు. "దయచేసి మా గోడు వినిపించుకోండి" అని ప్రధానమంత్రికి మొరపెట్టుకుంటున్నారు. వీరు పతకాలు సాధించినప్పుడు మోదీ క్రీడాకారులను ఉదయం ఫలహారానికి ఆహ్వానించారు. ఆయనకు ఆ విషయమైనా జ్ఞప్తికి వస్తే బ్రిజ్ భూషణ్ మీద చర్య తీసుకోవడానికి ముందుకు వస్తారా? ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఎదుట బాధితులు వాంగ్మూలాలు నమోదు చేసినా ఏ చర్యా తీసుకోలేదు. మేం అబద్ధం చెప్తున్నామనుకుంటే నార్కో పరీక్షకైనా సిద్ధమేనంటున్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించిన వారు ఉన్నారన్నది ఖాయం. లైంగిక వేధింపులకు పాల్పడేది కేవలం రాజకీయ నాయకులే కానక్కర్లేదు. అయితే ఆ పని చేసిన వారికి రాజకీయాలు రక్షా కవచంగా పని చేస్తాయి. దుర్భేధ్యమైన ఆ కవచాన్ని ఛేదించడానికి ఈ మల్ల యోధులకు రాజకీయ పార్టీల అండ అవసరం. లేకపోతే అధికార పార్టీ ఎంపీ మెడలు వంచడం దుర్లభమే. క్రీడా రంగంలో రాజకీయ నాయకుల ఆధిపత్యానికి ముగింపు పలకాల్సిందే.

ఇజ్రాయిల్-పలస్తీనా శాంతికి చైనా మధ్యవర్తిత్వం

సాత్యకి చక్రవర్తి

అమెరికా మధ్యప్రాచ్యంలో తన దౌత్య పోరాటాన్ని క్రమంగా కోల్పోతోంది. ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు, దేశాల మధ్య సంధానకర్తగా వ్యవహరించడానికి మధ్య ప్రాచ్య దేశాలు చైనా వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇరాన్-సౌదీ అరేబియాల మధ్య శాంతి ఒప్పందం అమలు, ఇజ్రాయిల్-పలస్తీనాల మధ్య శాంతి చేకూర్చేందుకు చైనా తనదైన పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రి ఇజ్రాయిల్, పలస్తీనా విదేశాంగమంత్రులతో ఫోన్‌లో మాట్లాడుతూ రెండు దేశాలమధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దేశాల మధ్య శాంతిని చేకూర్చేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. సౌదీ అరేబియా-ఇరాన్ మధ్య 2016లో బెడిసికొట్టిన దౌత్య సంబంధాలను పునరుద్ధరించడానికి గత నెలలో చైనా మధ్యవర్తిత్వంలో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం యెమెన్‌లో జరుగుతున్న యుద్ధంలో నూతన శాంతి ప్రక్రియకు దోహదపడింది. ఇరాన్-సౌదీ అరేబియాల మధ్య సంబంధాలను పునరుద్ధరణలో చైనా విజయం సాధించడం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దౌత్యపరంగా విఫలమయ్యారు. సౌదీ అరేబియా అమెరికాకు ప్రధాన మద్దతుదారు. ఇరాన్, పశ్చిమ ఆసియా దేశాలకు వ్యతిరేకంగా సౌదీ అరేబియాకు అమెరికా మద్దతిస్తూ వచ్చింది.

చర్చల ద్వారా సౌదీ అరేబియా-ఇరాన్‌ల మధ్య విభేదాలను పరిష్కరించడంపై ఇజ్రాయిల్ విదేశాంగ మంత్రి ఎలికోహెన్‌తో చైనా విదేశాంగ మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్-పలస్తీనియన్ల మధ్య శాంతి చర్చలను తిరిగి ప్రారంభించడానికి తాము సిద్ధమని పేర్కొన్నారు. వీరిమధ్య చర్చల సులభతరం చేసే మూడవదేశంగా తాము వ్యవహరిస్తామన్నారు. పలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మల్కీతో చైనా విదేశాంగమంత్రి మాట్లాడుతూ, శాంతి చర్చల పునరుద్ధరణలో చైనా క్రియాశీల పాత్రకు సిద్ధంగా ఉందని, పలస్తీనా కూడా ఉద్రిక్తతలు ఉన్న ప్రాంతంలో సంయమనం పాటించాలని సూచించారు. సమస్యను స్వల్పకాలంలో పరిష్కరించడం కష్టమని, సానుకూల దౌత్య మార్గాల ద్వారా పశ్చిమాసియా దేశాలతో చైనా చర్చలు, లాటిన్ అమెరికా దేశాలతో చైనా సాధించిన విజయాలు అమెరికా నిరంకుశత్వం కింద మగ్గుతున్న దేశాలు చైనాతో సంబంధాల కోసం ఉవ్విళ్లూరుతున్నాయి. ఉదాహరణకు తైవాన్‌తో అన్ని సంబంధాలను తెంచుకోవడంతో కొలంబియాను చైనాను గుర్తించింది. క్యూబా విప్లవవీరుడు కాస్ట్రో నేతృత్వంలో కొలంబియా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లాటిన్ అమెరికాలో అమెరికా దౌత్యానికి పెద్ద షాక్ అయింది.

200 సంవత్సరాల క్రితం మన్రో సిద్ధాంతాన్ని ప్రకటించింది. అప్పటి నుండి లాటిన్ అమెరికన్, కరేబియన్ దేశాల వ్యవహారాలను అమెరికా తన స్వప్రయోజనాల కోసం ఉపయోగించుకుంది. లాటిన్ అమెరికా దేశాల్లో జాతీయ, ప్రాంతీయ స్వాతంత్ర్యం కోసం పెద్ద ఎత్తున విప్లవాలు జరిగాయి. పేద, అట్టడుగు వర్గాలు అమెరికా సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించాయి. చివరికి స్వదేశీ ఉద్యమాలు, కార్మిక సమీకరణలు, ప్రగతిశీల, సామ్యవాద ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఉదాహరణకు, క్యూబాలో వామపక్ష ప్రభుత్వం 63 సంవత్సరాలుగా కొనసాగింది. అమెరికా రాజకీయపట్టు లాటిన్ అమెరికా దేశాల్లో బలహీనపడి ఉండవచ్చు, కానీ ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థలపై అమెరికా నియంత్రణ తీవ్రంగా ఉంది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అది ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించింది. ప్రస్తుతం ఇప్పుడు, బీటలువారుతున్నది. ప్రత్యేకించి, అమెరికా డాలర్ బలహీనపడుతోంది.

1944లో, 44 మిత్రదేశాలు తమ తమ కరెన్సీ, బంగారం విలువకు బదులుగా అమెరికా డాలర్ విలువతో పరస్పర సంబంధం కలిగి ఉన్నాయి. అప్పటి నుండి ప్రపంచంలోని వివిధ దేశాలు తమ రిజర్వ్ కరెన్సీల కోసం, విదేశీ వాణిజ్యం, బ్యాంకింగ్ లావాదేవీల కోసం అమెరికా డాలర్‌పై ఆధారపడి ఉన్నాయి. కానీ ఇప్పుడు, లాటిన్ అమెరికా దేశాలు డాలర్‌తో పోలిస్తే చైనా కరెన్సీ యువాన్‌తో వర్తకం చేస్తున్నాయి. లాటిన్ అమెరికాలో అతిపెద్ద జనాభా కలిగిన దేశం బ్రెజిల్, గత వారం డాలర్‌కు బదులుగా యువాన్ కరెన్సీగా ఉపయోగించాలని నిర్ణయించుకుంది. బ్రెజిల్ మాదిరిగా ఇతరదేశాలు త్వరలో చైనాతో మెరుగైన వాణిజ్య సంబంధాలను కొనసాగించే అవకాశం ఉంది. అమెరికా చైనాపై భౌగోళికంగా, వ్యూహాత్మకంగా వాణిజ్య యుద్ధం కొనసాగిస్తోంది, అమెరికా- మధ్యప్రాచ్యం, ఇజ్రాయిల్- పలస్తీనాల మధ్య శాంతి చర్చలకు, మధ్యవర్తిత్వానికి చైనా చేపట్టిన చర్యలు సఫలమైతే, అమెరికా ఆధిపత్యానికి చెక్ పడినట్లే...

భూ పంపిణీ పునరుద్ధరించాలి

డా.సోమ మర్ల

భారతదేశంలో గ్రామీణ పేదల అభ్యున్నతికి సొంత భూమి అత్యంత కీలకమైంది. దేశానికి బ్రిటీషు వలసపాలకుల నుంచి స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలకాలం గడిచింది. అయినప్పటికీ నేటికీ భూస్వామ్యవర్గాల అధీనంలోనే అత్యధిక భూ కమతాలున్నాయి. రైతు కుటుంబాలకు చెందిన సన్నకారు రైతులు, భూమిలేని రైతులు 80శాతం మంది ఉన్నారు. పేదరికం నిర్మూలనకు, వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుదలకు ఎక్కువ మంది రైతులకు భూములు లేకపోవడం పెద్ద అడ్డంకి. నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలు భూమి, ఆహారం మార్కెట్‌లో విక్రయించే వస్తువులుగా మారిపోయాయి. స్వాతంత్ర్యం వచ్చినవెంటనే జమిందారీ వ్యవస్థను రద్దుచేసి భూ సంస్కరణలు ప్రతిపాదించారు. భూమిలేని సన్నకారు రైతులకు భూమి లివ్వాలనే లక్ష్యంతో ఈ ప్రతిపాదన చేశారు. అయితే భూ సంస్కరణలు దేశవ్యాప్తంగా అమలు జరగలేదు. 1960లలో వచ్చిన హరితవిప్లవం ఆహార ఉత్పత్తిని పెంచింది. అయితే ఇది సన్న, చిన్నకారు రైతులు, సంపన్నులైన రైతులమధ్య అసమానతలు పెంచింది. దేశంలో చాలావేగంగా భూ సంస్కరణలు తిరోగమనం పట్టాయి. సీపీఐ నాయకత్వంలో తెలంగాణలో మహత్తర రైతాంగ పోరాటం, తిభగ (పశ్చిమబెంగాల్) ఉద్యమం 1950లలో జరిగాయి. ఈ రాష్ట్రాల్లో భూస్వాముల అధీనంలో ఉన్న దాదాపు పదిలక్షల ఎకరాల భూములను భూమిలేని పేదలకు పంపిణీ చేశారు. 1960లలో, 1970లలో అలిండియా కిసాన్‌సభ(ఏఐకెఎస్) భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్‌లు(బికెఎంయు) నాయకత్వంలో మిలిటెంట్‌పోరాటాలు జరిగాయి. ఫలితంగా భూ సంస్కరణలు ప్రధాన అజెండాగా ప్రధానస్రవంతిలోకి వచ్చాయి. ఈ పోరాటాల కారణంగా భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు భూ సంస్కరణల అమలును మళ్లీ పరిగణలోకి తీసుకున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో చట్టం చేశాయి. భూ పరిమితిని విధించి భూస్వాముల నుండి కొంతభూమిని స్వాధీనం చేసుకున్నారు. చాలా నామమాత్రంగా చట్టం అమలైంది. సింహ భాగం భూములు అత్యధిక సంపన్న, మధ్య తరగతి రైతుల అధీనంలోనే ఉండిపోయాయి. వివిధరాష్ట్రాల్లో భూ సంస్కరణలఅమలు విఫలంకావడంతో గ్రామాల్లో పేదరికం, నిరుద్యోగ సమస్యలు ఎక్కువభాగం పరిష్కారం కాలేదు. 2020 నాటికి 82.2శాతం చిన్న, సన్నకారు రైతులు రెండు హెక్టార్లలోపు సొంతభూములు కలిగిన వాళ్లున్నారు. వీరికి 47.3శాతం పంట భూము లున్నాయి. తక్కిన 52.7శాతం భూములు అతికొద్దిమంది పెద్ద భూస్వాములు, మధ్యతరహా రైతుల చేతుల్లోనే ఉన్నాయి.

తెలంగాణలో భూ సంస్కరణలు(పంట భూములపై పరిమితి) చట్టం-1973 ప్రకారం పంట భూములపై పరిమితి (భూదాన భూములు సహా) విధించి మిగులు భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. కేవలం 2.1శాతం పంట భూములను మాత్రం భూమిలేని పేద రైతులకు పంపిణీ చేశారు. అయితే ఈ భూముల్లో అత్యధికం భూస్వాములు చేతుల్లో ఉండటం

లేదా న్యాయపరమైన చిక్కులు, నిరంకుశ అధికార యంత్రాంగం కారణంగా ప్రతిష్టంభన ఏర్పడింది. ఈ విధంగా భూమిలేని రైతులకు పంపిణీ లక్ష్యం అపరిష్కృతంగా ఉండిపోయింది. జాతీయ నమూనా సర్వే(ఎన్ఎస్ఎఫ్) ప్రకారం పంజాబ్, బీహార్‌లలో 80శాతం భూమి పదిశాతం పెద్దపెద్ద భూస్వాములు చేతుల్లో ఉండగా, తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్‌లలో 55శాతం సాగుభూమి, 10శాతం భూస్వామ్య కుటుంబాల అధీనంలోనే ఉంది. దేశంలో 4.9శాతం పెద్ద రైతుల చేతుల్లో 32శాతం సాగుభూమి ఉంది. సన్నకారు రైతుకంటే పెద్దరైతుకు 45రెట్లు ఎక్కువగా భూమిఉంది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూమిలేని రైతులు 40లక్షలమంది (56.4శాతం)ఉన్నారు. పంటలు పండే మొత్తం భూమిలో 82శాతం సారవంతమైన, సాగుచేసుకునే భూమి అతిపెద్ద భూస్వామ్య రైతుల చేతుల్లో ఉంది. అదేసమయంలో సన్న, చిన్నకారు రైతుల పరిధిలో తక్కువ సారవంత మైన, అత్యధికభాగం వర్షాధారపంటలు పండేభూమిఉంది. భూములు కోల్పోయిన రైతులు వ్యవసాయ కూలీలుగా మారారు. వ్యవసాయం భారమైపోవడంతో ఎరువులు, డీజిలు, విత్తనాల ధరలు భారీగాపెరిగి వాటిని భరించలేక వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు. గింజల వ్యాపారంచేసే పెద్ద కంపెనీలు, మార్కెట్‌శక్తులు చిన్నరైతులను దోచుకోవడం పెరిగిపోయింది.

మరోవైపు పండిన పంటకు కనీస మద్దతుధర రాక గిట్టుబాటు కావడంలేదు. దీనితో చిన్నరైతులు అప్పుల పాలవుతున్నారు. అంతేకాదు వాతావరణ మార్పుల కారణంగా పంటలు సరిగా పండక దివాలా తీస్తున్నారు. నయా ఉదారవాద నమూనా అభివృద్ధి ఉపకరణాల సరఫరా, భూ యాజమాన్యం, మార్కెటింగ్, పంపిణీ విషయాలలో వ్యవసాయాధారిత వ్యాపారంచేసే బడా వాణిజ్యవేత్తలు గుత్తాధిపత్యం సంపాదించారు. కార్పొరేట్ వ్యవసాయం ఇందుకు సాధనంగా ఉపయోగపడింది. 2014లో చేసిన భూ సేకరణచట్టం, మూడు వ్యవసాయచట్టాలు సన్నకారు, చిన్న రైతులను వ్యవసాయం నుంచి బైటకు పంపేందుకు ఉద్దేశించినదే. సగటు వ్యవసాయ కుటుంబాల నెలసరి నికరాదాయం 2018-19లో కేవలం 8337 రూపాయలు మాత్రమే. సాగు వలన వచ్చే ఆదాయంకంటే ఇతర విధాలుగా పనులుచేసి తెచ్చుకునే ఆదాయం ఎకరానికిలోపు ఉండే రైతు కుటుంబాలకు ఎక్కువగా ఉంటోంది. పంటఉత్పత్తి స్థానంలో వ్యవసాయఉత్పత్తి కుటుంబాలకు ఇతరపనులు చేయడంవల్ల లభించే వేతనాలే ప్రధాన వనరుగా ఉంటోంది. వ్యవసాయ కుటుంబాలు దినసరి వేతనాలు పొందడమేకాక, పశు పోషణ, కోళ్లపెంపకం తదితరమార్గాల్లో ఆదాయం పొందుతున్నారు. ఆదాయం తగ్గిపోవడం, వైద్యం, పిల్లల విద్యకు చేసే ఖర్చు పెరిగిపోయి అప్పులపాలై భూములు కూడా కోల్పోతున్నారు. వీరి దగ్గరనుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులు లేదా పెద్ద కార్పొరేషన్లు, లేదా భూస్వాములు భూమి కొనుగోలు చేస్తున్నారు.

2001 గణాంకాల ప్రకారం భూమి కలిగిన రైతులు 1273 లక్షలమంది ఉన్నారు. 2011 గణాంకాల ప్రకారం భూమిగల రైతుల సంఖ్య 86 లక్షలకు పడిపోయింది. భూమిలేని, సన్నకారు రైతులు కౌలు రైతులుగా మారి పోయారు. తెలంగాణ, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో కౌలు రైతుల సంఖ్య దాదాపు 40శాతం ఉంది. కౌలు రైతులకు ప్రధానమంత్రి సమ్మాన్, రైతుబంధు, విత్తనాలు ఎరువులకు సబ్సిడీలు పంట నష్టానికి పరిహారం తదితర ప్రయోజనాలను కౌలురైతులకు తిరస్కరిస్తున్నారు. ఇతరరైతుల మాదిరిగానే కౌలు రైతులు భూమి సాగుచేయడానికి అధికంగా వ్యయం చేస్తున్నారు. వచ్చిన ఆదాయంలో దాదాపు సగం భూ యజ మానులకు చెల్లించడానికి సరిపోతుంది. సాగుచేసిన కౌలురైతుకు చాలా తక్కువ ఆదాయం వస్తుంది. రైతు వ్యతిరేక నయా ఉదారవాద సంస్కరణలు రైతుల ఆత్మహత్యలకు దారితీసాయి. గత రెండుదశాబ్దాల కాలంలో 3.5లక్షల మంది రైతులు బలవంతంగా ప్రాణాలు తీసుకున్నారు. వ్యవసాయ కార్య కలాపాలలో దాదాపు 60శాతం మంది మహిళా రైతులు పనిచేస్తున్నారు. అయితే 12శాతం మహిళా రైతులకు మాత్రమే సొంతభూమి ఉంది. పురుషులకంటే వీరు శ్రమచేసిపొందే ఆదాయం 30శాతం తక్కువగా ఉంది. కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఉన్న పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాలలో భూపంపిణీ జరిగింది. అలాగే జమ్ముకశ్మీర్‌లో కూడా జరిగింది.

ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పంజాబ్, తమిళనాడు, త్రిపుర రాష్ట్రాలలో సీపీఐ, ఏఐకెఎస్, బికెఎంయూ సంఘాలు భూ ఆక్రమణ పోరాటాలు నిర్వహించగా భూసంస్కరణలు పాక్షికంగా అమలయ్యాయి. జమిందారీ, ఫ్యూడల్ భూస్వాములు సీలింగ్ తరువాత 68.72లక్షల ఎకరాల మిగుల భూమి ఉన్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం ఈ భూమిని స్వాధీనం చేసుకున్నప్పటికీ పాక్షికంగా భూ సంస్కరణలు అమలు చేశారు. చిత్తశుద్ధితో భూసంస్కరణల అమలు జరగకపోతే గ్రామాలలో నిరుద్యోగం, పేదరికం, నిర్మూలన సాధ్యంకాదు. సాగుచేసే రైతుకు వ్యవసాయభూమి ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

కులగణనతోనే సామాజిక సమగ్రత

కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఓబిసి కులగణనపై కాంగ్రెస్ కట్టుబడి ఉందని అలాగే కేంద్రం పార్లమెంటులో కులగణన బిల్లు తక్షణమే ప్రవేశపెట్టాలని పిలుపునిచ్చారు. బిహార్‌లో కుల ఆధారిత జనగణన పూర్తి అయ్యింది. దేశంలోని అన్ని రాష్ట్రాలలో బీసీ కుల గణనకు బీసీ ఉద్యమకారులు, దళిత ప్రజాతంత్ర వాదులు, వామపక్షాలు, మేధావులు డిమాండ్ చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడంలేదు. కుల గణన అనేది జరిగితే ఎవరు ఎంత శాతం ఉన్నారనేది తెలుస్తుంది. కులగణన చేపట్టక కేవలం ఎనిమిది శాతం ఉన్న ఆర్థికంగా వెనుకబడ్డ వారికి పది శాతం రిజర్వేషన్ కల్పించడం వలన వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. జనాభాలో 54శాతం ఉన్న వెనుకబడిన తరగతులకు కేవలం 27 శాతం రిజర్వేషన్ కల్పించారు. జనాభాలో 54 శాతం ఉన్న అన్ని రంగాల్లో వెనుకబడి పోయారు. చట్టసభల్లోనే కాదు గ్రామ మండల స్థాయిలో ప్రాతినిధ్యం లేని కులాలు అరవై శాతం వెనుకబడిన తరగతులలో ఉన్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికలలోగా ఓబీసీ వాటా భవిష్యత్తు తేల్చాలి. బీసీ కుల గణన చేపట్టకుంటే కేంద్రంలోని బీజేపీ సర్కారుతో తాడోపేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమయిందని మేధావులు హెచ్చరిస్తున్నారు. బీజేపీ సర్కార్ ఇదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లు వేయబోమని స్పష్టం చేశారు. రిజర్వేషన్లను ఎత్తేసేలా కేంద్రం వైఖరి బీసీ కుల గణనను చట్టం అనుమతిస్తుందని, కోర్టులు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయి. బీసీ జనాభా లెక్కలు లేకుండా దేశంలోని కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు బడ్జెట్ కేటాయింపులు ఎలా చేస్తారు. కులాల లెక్కలు తేల్చితే విద్యావంతులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు ఎంతమంది ఉన్నారో తెలుతుంది. దేశ సామాజిక, ఆర్థిక ముఖచిత్రం కూడా తెలుస్తుంది. కుల గణన జరిగితే రిజర్వేషన్లు పెంచాలని బీసీల నుంచి డిమాండ్ వస్తుందన్న ఉద్దేశంతోనే కేంద్రంలోని బీజేపీ సర్కారు ఆ పని చేయడం లేదు. తెలంగాణ, బిహార్, మహారాష్ట్ర, ఒడిశా, జార్ఖండ్, తమిళనాడు ముఖ్యమంత్రులు కులాల లెక్కలు తీయాలని కోరారు.

అసెంబ్లీల్లో తీర్మానాలు సైతం చేశారు. ప్రజలంతా వారి కులాల లెక్కలు తీయాలని కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా బీసీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నది. రూపాయి ఖర్చు లేకుండా కుల గణన చేసే అవకాశం ఉన్నా ఎందుకు చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలి. బీసీ జనాభా లెక్కలు బయటకొస్తేనే దోపిడీ చేసేవారికి అడ్డుకట్ట పడుతుంది. అందుకే లెక్కలు బయటకు రాకుండా ఆ వర్గాలను అణచివేసే ప్రయత్నం చేస్తున్నారు. 'అందరూ సమిష్టిగా కేంద్రం మెడలు వంచాలి. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి. బీసీల పోరాటానికి జాతీయ స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలు అండగా నిలవాలి. దేశంలో ఓబీసీల్లో 983 కులాలకు ఐదేండ్లుగా ప్రభుత్వపరంగా ఎలాంటి ప్రయోజనాలు అందట్లేదు. నిరుద్యోగం 8.4 శాతానికి పెరిగింది. ప్రభుత్వ రంగ సంస్థలు దివాలా తీసేలా చేస్తున్నారు.

ఇన్సూరెన్స్, రైల్వే, కమ్యూనికేషన్, చివరికి ఇస్రో, హెచ్ఏఎల్ ప్రవేటు పరం చేస్తున్నారు. ఆయన ఏదో చేస్తున్నారన్న భ్రమ నుంచి ప్రజలు బయట పడాలి. బీసీల్లోని అన్ని కులాలు ఏకతాటిపైకి వచ్చి పోరాడాలి. కులం పేరుతో వివక్షకు గురైన వర్గాల వారికి సమ ప్రాతినిధ్యం దక్కించడం కోసమే రిజర్వేషన్ల వ్యవస్థ అని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నారు. ఆర్థిక ప్రాతిపదికన ఇవ్వాల్సినవి సంక్షేమ పథకాలు మాత్రమే. ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లు ఈబీసీ వర్గాలకు ఎక్కడ నుండి వచ్చాయి? రిజర్వేషన్‌కు ప్రాతిపదిక కులం (సామాజిక వెనుకబాటు) మాత్రమే, కేంద్రంలో బీజేపీ ఏర్పడిన నాటినుండి అంతా తారుమారు అయింది. మండల్ కమీషన్ నివేదిక ప్రకారం ఓబీసీల జనాభా 54శాతం, అగ్రకులాల జనాభా ఎంత అనేది తెలియకుండా వారికి10శాతం రిజర్వేషన్లా? అసలు ఏ లెక్కల ప్రకారం 10శాతం కేటాయించారు అనే దానిపై చర్చ జరగలేదు. తీర్పు వెలువరించే ముందు ఓసిల జనాభాను సుప్రీం కోర్టు పరిగణనలోకి తీసుకున్నట్లు లేదు. రిజర్వేషన్లు 50శాతం దాటొచ్చు అన్న సుప్రీం తీర్పు వెనుకబడిన తరగతులు అనుకూలంగా మలచుకుని జనాభా దామాషా ప్రకారం ఓబీసీ లకు 54శాతం రిజర్వేషన్ల కోసం పోరాడాలి. సమగ్రంగా, శాస్త్రీయంగా అన్ని కులాల లెక్కలు తీయాలి. వేరే అంశాలు పక్కన పెట్టి జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలి. ఇదే అంశంపై దేశవ్యాప్త చర్చ జరగాలి.

రిజర్వేషన్లు 50శాతం దాటొచ్చు అన్న సుప్రీం తీర్పు ప్రకారం, ఓబీసీలకు 54శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి లేదా సమగ్రమైన, శాస్త్రీయమైన కులగణన ద్వారా జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలి. 1931జనాభా లెక్కల ప్రకారం ఓబీసీల జనాభా 54 శాతంగా మండల్ కమిషన్ పేర్కొంది, ఇప్పుడు ఆ శాతం మరింత పెరిగింది, ఎందుకంటే 1931 తర్వాత దేశవ్యాప్తంగా చాలా కులాలు ఓబీసీ జాబితాలో చేర్చారు. దళిత క్రిస్టియన్లు ఇప్పుడు అప్పటికంటే ఎక్కువయ్యారు. ఇప్పుడు లెక్కలు తీస్తే ఓబీసీ జనాభా 60 శాతం దాటొచ్చు, దానికనుగుణంగా అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం పెరగాలి. చారిత్రాత్మకమైన తప్పిదాలకు మనము అవకాశం ఇవ్వొద్దు, మన భవిష్యత్తు తరాలు మనల్ని నిందించకూడదు. ఓబీసీల దీర్ఘకాలిక ప్రయోజనాలు సాధన కోసం సాధించేవరకు పోరాడాలి. దేశవ్యాప్తంగా పేదలు, మధ్యతరగతి ప్రజలు అర్థాకలితో అలమటిస్తుంటే అదానీకి రోజుకు వెయ్యి కోట్ల ఆదాయం వస్తున్నట్టు ఇటీవల ప్రసార మాధ్యమాల్లో వచ్చింది. ఈ ఆర్థిక దోపిడీని అరికట్టడంతో పాటు దేశంలోని బీసీలకు న్యాయం జరిగేంతవరకు అందరితో కలిసి ఉద్యమించాలి. కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ 2018 ఎన్నికల సమయంలో బీసీ కుల గణన చేపడుతామని, రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ అమలు చేయలేదు.

డా. యం.సురేష్ బాబు,
గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య అధ్యక్షులు
9989988912

మండుటెండలతో భారత్‌కు వడదెబ్బ



- పెరుగుతున్న వేసవి తాపం - ప్రమాదంలో 90శాతం దేశం
- ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధనకు అడ్డుకట్ట
- అధిక ఉష్ణోగ్రతలతో 50ఏళ్లలో 17వేల మంది మృతి
- కేంబ్రిడ్జ్ వర్సిటీ అధ్యయనంలో వెల్లడి

న్యూదిల్లీ: దేశంలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకి ఉష్ణోగ్రతలు భారీగా నమోదు అవుతున్నాయి. బయటకు వస్తే నిప్పుల కొలిమి తరహా పరిస్థితిని ఉంటుందని ప్రజలు గడపదాటేందుకు భయపడుతున్నారు. రద్దీగా ప్రాంతాలు సైతం నిర్మానుష్యంగా మారుతున్నాయి. వాతావరణంలో సంభవిస్తున్న మార్పుల వల్ల వేసవి తాపం నానాటికీ పెరిగిపోతూ ఎన్నడూ లేని విధంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్లు పరిశోధనలు చెబుతున్నాయి. దేశ రాజధాని దిల్లీతో పాటు 90శాతం ప్రాంతాలు డేంజర్ జోన్‌లో ఉన్నట్లు లండన్ కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ తాజా అధ్యయనం వెల్లడించింది. దిల్లీలో వడగాడ్పులు తీవ్రత పెరిగి పరిస్థితి మరీ దారుణంగా ఉన్నట్లు పేర్కొంది. ఈ పరిణామాలతో వాతావరణ మార్పు నేపథ్య కార్యాచరణ ప్రణాళిక దెబ్బతిన్నట్లు తెలిపింది. పర్యవసానంగా ఐరాస నిర్దేశిత సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధన (ఎస్‌డీజీల)కు ఆటంకం కలుగుతోందని అధ్యయనం వెల్లడించింది. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన తన సహచరులతో కలిసి రమిత్ దేవ్‌నాథ్ నిర్వహించిన ఈ అధ్యయనంలో కీలక విషయాలను వెల్లడించారు.

50ఏళ్లలో దేశంలో 17వేల మందికిపైగా వడదెబ్బ/అధిక ఉష్ణోగ్రతల వల్ల మరణించారని భూశాస్త్ర మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి ఎం.రాజీవన్, శాస్త్రవేత్తలు కమల్జీత్ రే, ఎస్ఎస్ రే, ఆర్‌కే గిరి, ఏపీ దిమ్రీ అధ్యయన నివేదిక వెల్లడించింది. 2021లో ప్రచురితమైన ఈ నివేదిక ప్రకారం 1971-2019లో 706 'హీట్‌వేవ్' ఘటనలు నమోదయ్యాయి.

మహారాష్ట్రలోని నవీ ముంబైలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో వడదెబ్బ తగిలి 13మంది ప్రాణాలు కోల్పోయారు. దేశ చరిత్రలో నమోదైన ఇటువంటి ఘటనల్లో ఇది ఒకటిగా నిలిచింది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అధిక ఉష్ణోగ్రతలు లేనప్పుడు కూడా మరణాలు సంభవించాయి.

సాధారణంగా మధ్య, వాయువ్య భారతంతో పాటు కోస్తాంధ్రా, ఒడిశాలో వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలులు నమోదవుతాయి. వాతావరణ మార్పు, గ్లోబల్ వార్మింగ్, ప్రస్తుత పరిశోధన సిఫార్సుల ప్రకారం మూడు దశాబ్దాలుగా వడగాడ్పుల తీవ్రత పెరిగినట్లు తెలిసింది. లండన్‌లోని కేంబ్రిడ్జ్ వర్సిటీ తాజా అధ్యయనం ప్రకారం వాతావరణ మార్పులే ఇందుకు కారణమని తెలుస్తోంది. తాజా పరిస్థితుల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా భారత్ సాగించే పురోగతికి ఆటంకం కలుగుతుందని నివేదిక పేర్కొంది. 17 ఐరాస ఎస్‌డీజీల సాధనకు భారత్ సంకల్పించింది. అందులో పేదరికం నిర్మూలన, అందరికీ ఆరోగ్యం, గౌరవమైన పని, ఆర్థిక వృద్ధి వంటివి ఉన్నాయి. వాతావరణ మార్పు, భారత్‌లో వాతావరణ పరిస్థితుల వల్ల ఎస్‌డీజీ పురోగతిపై ప్రభావాన్ని అంచనా వేసేందుకు శాస్త్రవేత్తలు 'హీట్ ఇండెక్స్' (హెచ్ఐ)ను క్లైమేట్ వల్నేరబిలిటీ ఇండెక్స్ (సీవీఐ)తో పోల్చారు. సామాజిక ఆర్థిక, జీవనోపాధి, జీవ-భౌతిక అంశాలాధారంగా ఈ సూచీ రూపొందింది. ప్రభుత్వ డేటా ఆధారంగా రాష్ట్రస్థాయి వాతావరణ పరిస్థితులను పరిశోధకులు సమీక్షించారు. అనంతరం 20ఏళ్ల (2001-21)లో అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు సంభవించిన మరణాల నేపథ్యంలో భారత్ సాధించిన ఎస్‌డీజీ పురోగతినీ పరిశీలించారు. గత అంచనాలకు మించి ఎస్‌డీజీ పురోగతిని వడగాడ్పులు దెబ్బతీసినట్లు గుర్తించారు. 90శాతం దేశం ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నదని, అధిక ఉష్ణోగ్రతలు, వేడి, వడగాడ్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు తక్షణ చర్యలను చేపట్టకపోతేగనుక సుస్థిరాభివృద్ధి లక్ష్యసాధణలో భారత్ పురోగతి మందగిస్తుందని హెచ్చరించారు.

కాగా 121 ఏళ్లల్లో ఉష్ణమాసంగా మార్చి (2022) నిలిచింది. మూడవ పొడిమాసం కూడా ఇదే. 1901 నుంచి అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైనది 2022, ఏప్రిల్‌లోనూ కావడం గమనార్హం. దేశంలో 75శాతం కార్మికులు అంటే 3.80కోట్ల మంది వేసవి తాపం వల్ల ఒత్తిడికి గురవుతుంటారు. 2030 వరకు ఇలాంటి పరిస్థితే కొనసాగితే జీడీపీలో 2.5 శాతం నుంచి 4.5శాతం వరకు నష్టపోయే అవకాశం ఉంటుందని మెక్‌కిన్సే గ్లోబల్ ఇనిస్టిట్యూట్ నివేదిక హెచ్చరించింది.

మా పిల్లలకు వివాహ సమానత్వాన్ని ప్రసాదించండి

సీజేఐకి 'స్వీకార్-ది రెయిన్‌బో పేరెంట్స్' లేఖ

న్యూదిల్లీ: వివాహ సమానత్వం కోసం చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ స్వీకర్ - ది రెయిన్‌బో అనే గ్రూప్‌కు చెందిన 400 మంది భారతీయ ఎల్జీబీటీక్యూఐఏ పిల్లల తల్లిదండ్రుల బృందం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్‌కు బహిరంగ లేఖ రాసింది. భారతదేశంలోని ప్రత్యేక వివాహాల చట్టం ప్రకారం వారి పిల్లలు, అత్తమామలు తమ సంబంధానికి చట్టపరమైన ఆమోదం పొందేలా చూడాలనే కోరికను ఈ బృందం వ్యక్తం చేసింది. స్వలింగ వివాహానికి చట్టపరమైన ధ్రువీకరణ కోరుతూ దాఖలైన పిటిషన్లను సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తున్న నేపథ్యంలో 'స్వీకార్-ది రెయిన్‌బో పేరెంట్స్' లేఖ ప్రాముఖ్యతను సంతరించుకుంది. 'మేము వృద్ధులవుతున్నాము. మాలో కొందరు త్వరలో 80కి చేరుకుంటారు, మా జీవితకాలంలో మా పిల్లల వివాహంపై చట్టబద్ధమైన ముద్రను చూడగలమని మేము ఆశిస్తున్నాము' అని రెయిన్‌బో గ్రూప్ తన లేఖలో పేర్కొంది. 'స్వీకార్-ది రెయిన్‌బో పేరెంట్స్' అనేది ఒకరి బిడ్డను పూర్తిగా అంగీకరించడానికి, ఒక కుటుంబంగా సంతోషంగా ఉండటానికి పరస్పరం సహకరించుకునే లక్ష్యంతో భారతీయ ఎల్జీబీటీక్యూఐఏ (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్, క్వెస్టింగ్, ఇంటర్‌సెక్స్, పాన్సెక్సువల్, టూ-స్పిరిట్, అలైంగిక , మిత్ర) పిల్లల తల్లిదండ్రులతో ఏర్పడిన గ్రూప్.

పరిష్కారం లభించే వరకు సర్వే పనులు నిలిపివేయాలి: అజిత్ పవార్

ముంబై: రత్నగిరి జిల్లాలోని రిఫైనరీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా స్థానికులు చేస్తున్న నిరసనలను శాంతియతంగా నిర్వహించాలని, సామరస్యపూర్వక పరిష్కారం లభించే వరకు రాష్ట్ర ప్రభుత్వం సర్వే పనులను నిలిపివేయాలని మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు అజిత్ పవార్ మంగళవారం డిమాండ్ చేశారు. జిల్లాలోని బార్సు వద్ద రిఫైనరీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనలపై నివేదిస్తున్న జర్నలిస్టుల గొంతును అణచివేయడం ఆపాలని పవార్ కోరారు. 'ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంది. ఆందోళనకారులను అరెస్టు చేస్తున్నారు. ప్రభుత్వం స్థానికుల మనోభావాలను గౌరవించి, సున్నితత్వంతో సమస్యను పరిష్కరించాలి' అని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌లు చర్చల ద్వారా పరిష్కారాన్ని కనుగొనాలని పవార్ అన్నారు. అప్పటి వరకు, సర్వే (రిఫైనరీ ప్రాజెక్ట్ కోసం) నిలిపివేయాలని సూచించారు. అంతకుముందు రిఫైనరీ ప్రాజెక్టును మొదట జిల్లాలోని నానార్ వద్ద ఏర్పాటు చేయ తలపెట్టగా అంతకుముందు స్థానికుల నిరసనల తరువాత, పూర్వపు ఉద్ధవ్ థాకరే ప్రభుత్వం బార్సు వద్ద రిఫైనరీ ప్రాజెక్ట్ కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని కేంద్రానికి సూచించింది. అయితే ఇక్కడ కూడా ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకత ఎదురవుతోంది. రత్నగిరి జిల్లా జైతాపూర్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద న్యూక్లియర్ పవర్ పార్క్ కూడా ఉంటుంది. ఈ ప్రాజెక్టును కూడా స్థానికులు వ్యతిరేకిస్తున్నారు..

సిసోదియాపై అనుబంధ చార్జిషీటు



న్యూదిల్లీ: మద్యం కుంభకోణం కేసులో దిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఇతరులపై సీబీఐ మంగళవారం అనుబంధ చార్జిషీటు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో సిసోదియాను ఫిబ్రవరి 26న సీబీఐ అరెస్టు చేసింది. 58వ రోజు చార్జిషీటు దాఖలు చేసింది. అయితే సిసోదియాకు ఇప్పటికీ బెయిల్ మంజూరు కాలేదు. సిసోదియాతో పాటు హైదరాబాద్‌కు చెందిన సీఏ బుచ్చిబాబు గోరంట్ల, మద్యం వ్యాపారి అమన్‌దీప్‌సింగ్ ధాల్, ప్రైవేట్ వ్యక్తి అర్జున్ పాండేలపైనా చార్జిషీటు దాఖలు చేసింది. అవినీతి నిరోధక చట్టంలోని అనేక నిబంధనలతో పాటు ఐపీసీ 120-బి, 201, 420 సెక్షన్ల కింద సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ చార్జిషీటును సీబీఐ ప్రత్యేక కోర్టులో దాఖలు చేసింది. ఈ కేసులో విస్తృత కుట్ర కోణం ఉందని, ఇతరుల పాత్ర కూడా ఉందని సీబీఐ తెలిపింది. మద్యం విధానంలో అనేక అక్రమాలు జరిగాయని, ఆశ్రితపక్షపాతం కనిపించిందని వివరించింది. మద్యం విధానంలో అనేక మార్పులు చేయడం ద్వారా కొంతమందికి అయాచిత లబ్ధి చేకూర్చినట్లు ఆరోపించింది.

ప్రజలే సమాధి కడతారు

మోదీ వ్యాఖ్యలపై ప్రియాంకగాంధీ

టి నరసిపుర: తనకు సమాధి తవ్వాలని ప్రతిపక్ష పార్టీ కోరుకుంటున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా మంగళవారం స్పందించారు. మోదీకి సమాధి తవ్వాలని ఈ దేశంలో ఏ ఒక్కరూ అనుకోవడం లేదని, మోదీ ఆరోగ్యవంతంగా, ఎక్కువకాలం జీవించాలని కోరుకుంటున్నారని ప్రియాంక చెప్పారు. మోదీ చేస్తున్న ఇలాంటి ప్రకటనలు ఆశ్చర్యం కలిగిస్తాయని తెలిపారు. ఇది ఎన్నికల సమయమని, కేవలం ఓట్ల కోసం, సానుభూతి కోసం మోదీ ఇలాంటి నాటకాలు చాలా ఆడతారని చెప్పారు. ఈ ఎన్నికలు మోదీ కోసం లేదా ఏ ఒక్క నాయకుడి కోసమో కాదని, పార్టీలకతీతమని ప్రియాంక తెలిపారు. 'బీజేపీ నాయకులు ఇక్కడకు రావడం చూస్తున్నా. వింత పోకడలు పోతున్నారు. నా సమాధి తవ్వాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుకుంటున్నారని స్వయానా ప్రధాని మోదీ మాట్లాడటం విన్నాను. ఈ మాటలకు అర్థమేమిటి?ఆయన ఆరోగ్యంగా ఉండాలని అందరం కోరుకుంటున్నాం' అని ప్రియాంక చెప్పారు. మే 10వ తేదీన జరిగే కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రియాంకగాంధీ మాట్లాడారు. 'నన్ను సమాధి చేయాలని కాంగ్రెస్ కోరుకుంటున్నదని మోదీ చెబుతున్నారు. ఇది ఎన్నికల అంశమా? మోదీ, ఇతర బీజేపీ నాయకులు వింత సమస్యలను ప్రస్తావిస్తున్నారు. కమలనాథులు ప్రజల గురించి ఎందుకు మాట్లాడటం లేదు. ప్రజల సమస్యలు పట్టించుకోరు. ధరల పెరుగుదలపై మాట్లాడరు. నిరుద్యోగం ఊసే లేదు. కానీ మిమ్ములను ముందుకు తీసుకెళతామని ప్రగల్భాలు పలుకుతున్నారు' అని ప్రియాంక విమర్శల వర్షం కురిపించారు. బీజేపీ నేతల ఆలోచనా ధోరణిని గమనించాలని ప్రజలను కోరారు. ప్రజలే మోదీకి సమాధి తవ్వుతారని కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. 'మోదీ...మీ కమలం వికసిస్తుంది' అని మోదీ సభల్లో బీజేపీ నేతలు చేస్తున్న నినాదానికి ప్రతిగా కాంగ్రెస్ దీనిని తీసుకొచ్చింది. 'ఈ ఎన్నికలు మీ సమస్యల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉంది. ప్రజల సమస్యలు కేంద్రంగా ప్రచారం జరగాలి. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పార్టీలు మేనిఫెస్టోలు ప్రకటించాలి. ఇప్పటి వరకు ఏమి చేశాం...భవిష్యత్‌లో ఏమి చేస్తామో ప్రజలకు వివరించాల్సిన అవసరం రాజకీయ నాయకులపై ఉంది' అని ఆమె చెప్పారు. ఈ ఎన్నికలు మీవేనన్న విషయాన్ని తెలుసుకోలేకపోతే మీ బిడ్డల భవిష్యత్ సర్వనాశనమవుతుంది. రాష్ట్రాన్ని, సంస్కృతిని కాపాడేవి ఈ ఎన్నికలు. మీరు మరో పెద్ద తప్పుచేయకుండా ఆలోచించుకోవాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్‌సింగ్, మాజీమంత్రి హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యే యతీంద్ర సిద్ధరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్ల ఆందోళనకు రైతుల మద్దతు

సుప్రీంకోర్టులో 28న విచారణ

న్యూదిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడిన రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు బ్రిజ్‌బూషణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని దేశ రాజధాని దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద రెజర్లు ఆందోళన కొనసాగిస్తున్నారు. కాగా క్రీడాకారులకు అనేకమంది తమ మద్దతు ప్రకటిస్తున్నారు. సోనిపట్‌కు చెందిన రైతుల బృందం ఆందోళన చేస్తున్న క్రీడాకారులకు మద్దతు తెలుపుతూ... జంతర్‌మంతర్‌కు బయలుదేరింది. బ్రిజ్‌బూషణ్‌పై చర్యలు తీసుకునే వరకు దిల్లీ నుంచి తిరిగి వచ్చేది లేదని రైతు నాయకులు స్పష్టం చేశారు. సింఘు సరిహద్దుల్లో నిరసన తెలిపిన తరహాలోనే జంతర్‌మంతర్ వద్ద నిరసనకు దిగుతామని వారు స్పష్టం చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ క్రీడాకారులకు మద్దతు తెలిపింది. మరోవైపు లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసినా పోలీసులు ఇప్పటి వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఆరోపిస్తూ ఏడుగురు రెజర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ విషయంపై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. దిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేసిన సర్వోన్నత న్యాయస్థానం... క్రీడాకారులు చేసిన ఆరోపణలను తీవ్రంగా పరిగణించింది. ఈ అంశంపై శుక్రవారం మరోసారి విచారించనున్నది. రెజ్లర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ కేసును వాదిస్తున్నారు. ఆరోపణలు చేసిన ఏడుగురు రెజ్లర్లలో ఓ మైనర్ ఉన్నట్లు పిటిషన్‌లో తెలిపారు. బ్రిజ్ బూషణ్‌పై కమిటీ ఓ రిపోర్టును తయారు చేసిందని, దాన్ని ఇంకా బహిరంగపర్చలేదని, ఆయనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదని సిబల్ వాదించారు. మైనర్ ఫిర్యాదును పరిగణలోకి తీసుకోవాలని, ఆ అమ్మాయి దేశానికి స్వర్ణ పతకాన్ని తీసుకువచ్చిందన్నారు. అయితే, క్రీడాకారుల ఆందోళనపై డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ బూషణ్ సింగ్ స్పందించారు. ఈ విషయం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందని, కోర్టే నిర్ణయిస్తుందన్నారు. కాగా లైంగిక వేధింపులపై చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి తీసుకువస్తున్నారని బజరంగ్ పూనియా విలేకరుల సమావేశంలో ఆరోపించారు. అసోసియేషన్‌కు చెందిన కొందరు అధికారులు మైనర్ సహా మహిళా రెజర్లను సంప్రదించారని, ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని కోరారన్నారు. అందరికీ డబ్బు ఆశ చూపించారని, రెజ్లింగ్ అసోసియేషన్ అధికారులు తన ఇంటికి వెళ్లి ఒత్తిడి తెస్తున్నారని పూనియా పేర్కొన్నాడు. వారికి ఏదైనా జరిగితే దానికి ప్రభుత్వం, పోలీసులదే బాధ్యతని, అమ్మాయిల పేర్లు ఎలా బయటకు వచ్చాయో కూడా తెలియదన్నారు.

బీజేపీని గద్దె దింపితేనే ప్రజాస్వామ్యానికి మనుగడ: ఖడ్గే

మంగళూరు: కేంద్రంలో, కర్నాటకలో బీజేపీ నేతృత్వంలోని అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించే అవకాశం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖడ్గే అన్నారు. మంగళవారంనాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవినీతిపై ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మౌనంగా ఉన్నారని, ప్రతిపక్ష నేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) సహా ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నేతలపై ఏదైనా సమస్య వచ్చినప్పుడు మాత్రమే మోదీ అవినీతి గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. 'దేశంలో అనేక ప్రాజెక్టులను స్థాపించడం ద్వారా కాంగ్రెస్ ఎల్లప్పుడూ అభివృద్ధిలో ముందుంది... 70 ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని మోదీ ప్రశ్నిస్తున్నారు కానీ బీజేపీ పాలనను మరిచిపోయినట్లున్నారు' అని ఖడ్గే విమర్శించారు. రాష్ట్రంలోని ప్రజా పనులపై బీజేపీ మంత్రులు లంచంగా డిమాండ్ చేసిన '40 శాతం కమీషన్' వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ... 'దేశంలో, కర్నాటకలో గత తొమ్మిదేళ్లలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏం చేసింది? ఇంజిన్ పట్టాలు తప్పింది. సింగిల్ ఇంజిన్ అంటే 40 శాతం కమీషన్... డబుల్ ఇంజిన్ 80 శాతాన్ని వెలికితీస్తోందా?' అని ఖడ్గే ఎద్దేవా చేశారు. కర్నాటకలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రజలతో సహా అందరికీ చాలా ముఖ్యమైనవని ఖడ్గే అన్నారు. 224 స్థానాలున్న అసెంబ్లీలో 150 సీట్లతో కాంగ్రెస్‌కు మంచి మెజారిటీ ఇవ్వాలని ఆయన ఓటర్లను కోరారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజలు ముందుకు రావాలన్నారు. 'కర్నాటకలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పాలన, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి గురించి మనం మాట్లాడాలి. కమీషన్ లేకుండా రాష్ట్రంలో ఇప్పుడు ఏ పనీ సాధ్యం కాదు' అని అన్నారు. సమర్థ పాలన, అభివృద్ధి, పెట్టుబడులకు పేరుగాంచిన కర్నాటక బీజేపీ ప్రభుత్వ దుష్పరిపాలన వల్ల ప్రతిష్ఠను కోల్పోతోందని ఖడ్గే అన్నారు. బీజేపీ... డబ్బు, కండబలంతో పాటు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగిస్తోందని ఖడ్గే అన్నారు. కర్నాటకలో మే 10న ఎన్నికలు జరగనుండగా, మే 13న ఫలితాలు వెలువడనున్నాయి.

మోదీకి విజయన్ ధన్యవాదాలు

తిరువనంతపురం: రాష్ట్రానికి వందేభారత్ రైలు కేటాయించినందుకు, అనేక అభివృద్ధి ప్రాజెక్టులను జాతికి అంకితం చేసినందుకు ప్రధాని నరేంద్రమోదీకి కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధన్యవాదాలు తెలిపారు. మోదీకి విజయన్ ఇలా ధన్యవాదాలు తెలపడం ఇదే మొదటిసారి. మరిన్ని వందేభారత్ రైళ్లను రాష్ట్రానికి ఇస్తారని ఆశిస్తున్నట్లు విజయన్ పేర్కొన్నారు. మా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడం, కొత్త రైల్వే లైన్లకు శంకుస్థాపన చేయడం, రైల్వే లైన్ల డబ్లింగ్, రైల్వే లైన్ల విద్యుదీకరణ, సిగ్నల్ వ్యవస్థను మెరుగుపరచడం, మా రైళ్ల వేగాన్ని పెంచడం, కొత్త రైళ్లు ప్రవేశపెట్టడం వంటి అనేక కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే ఇలాంటి రంగాల్లో అద్భుతాలు సృష్టించవచ్చని విజయన్ చెప్పారు. రానున్న రోజుల్లో సహకార స్ఫూర్తితో కేరళ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. డిజిటల్ సైన్స్ పార్కుకు శంకుస్థాపన చేయడం, కొచ్చి వాటర్ మెట్రోను జాతికి అంకితం చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు చెప్పారు.

అభివృద్ధే మా ప్రచార అజెండా: అభిషేక్

కోల్‌కతా/కూచ్‌బెహార్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అభివృద్ధి మంత్రమే తమ ప్రచార అస్త్రమని, బీజేపీలోగా మత ప్రచారం చేయబోమని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అభిషేక్ బెనర్జీ మంగళవారం చెప్పారు. రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం 'తృణమూల్‌కు కొత్త గాలి' పేరుతో అభిషేక్ బెనర్జీ కూచ్‌బెహార్ జిల్లాలో భారీ ప్రచారం ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రజా పంచాయతీ నిర్మాణమే తృణమూల్ లక్ష్యమని బెనర్జీ చెప్పారు. 'వచ్చే లోక్‌సభ ఎన్నికలు బెంగాల్‌లో అభివృద్ధి అజెండాగానే జరుగుతాయి. మత విభజన అంశాలు మా విధానం కాదు. మతం పేరుతో ఓట్లు దండుకోవడం బీజేపీ కుట్ర. బీజేపీ కుట్రలను ఓడిస్తాం. మోదీ సర్కారును ఇంటికి పంపుతాం. రాష్ట్ర ప్రజల హక్కుల కోసం మేం పోరాడతాం' అని ఆయన చెప్పారు. ప్రచారంలో భాగంగా అభిషేక్ బెనర్జీ ప్రజలతో మాట్లాడారు. వారి కష్టాలు అడిగి తెలుసుకున్నారు. 'మీ హక్కుల కోసం పోరాడే ఏకైక పార్టీ టీఎంసీ. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన నిధులను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని బీజేపీ ఇంకా అంగీకరించలేకపోతోంది' అని ఆయన తెలిపారు. అభిషేక్ బెనర్జీ రెండునెలల పాటు 3,500 కి.మీ. సుదీర్ఘ యాత్ర చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 250కి పైగా ర్యాలీలు నిర్వహిస్తారు. ప్రజలకు మరింత దగ్గరవడం కోసమే ప్రచార కార్యక్రమం చేపట్టినట్లు ఆయన ఇంతకుముందు చెప్పారు.

రూ.801 కోట్లు పొదుపు చేసిన 17వ లోక్‌సభ

న్యూదిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో చేపట్టిన ఈ-వాహనాల వినియోగం, పేపర్‌లెస్ కార్యాలయం వంటి చర్యల వల్ల 17వ లోక్‌సభ జరిగిన నాలుగేళ్లలో రూ.801.46 కోట్లు ఆదా అయ్యాయని ఓ పార్లమెంట్ అధికారి మంగళవారం తెలిపారు. ఇది మే 2019లో 17వ లోక్‌సభ ఏర్పాటైనప్పటి నుంచి నాలుగేళ్లలో చేసిన బడ్జెట్ కేటాయింపుల్లో దాదాపు నాలుగింట ఒక వంతు పొదుపు అని అధికారి పేర్కొన్నారు. లోక్‌సభ సెక్రటేరియట్ 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ. 258.47 కోట్లు, 2022-23లో రూ. 132.60 కోట్లు ఆదా చేసినట్లు అధికారి తెలిపారు. ఇంకా 13 నెలల కాలం ఉన్న 12వ లోక్‌సభ మొత్తం బడ్జెట్ కేటాయింపులో రూ.7.01 కోట్లను ఆదా చేసుకోగలిగింది. 13వ లోక్‌సభ (1999-2004) ఐదేళ్ల కాలంలో 99.52 కోట్ల నిధులను ఆదా చేసింది.14వ లోక్‌సభలో పొదుపు 145.07 కోట్లు. 15వ లోక్‌సభలో రూ.94.17 కోట్లు, 16వ లోక్‌సభలో రూ.461 కోట్లు. కోవిడ్-19 మహమ్మారి కారణంగా పార్లమెంటు సమావేశాలను తగ్గించడంతోపాటు బిర్లా చేపట్టిన పొదుపు చర్యల కారణంగా 17వ లోక్‌సభలో రికార్డు స్థాయిలో వ్యయం ఆదా అవుతోంది. గత నాలుగు సంవత్సరాలలో, కార్యాలయాన్ని కాగిత రహితంగా మార్చడం, ఇ-వాహనాలను ప్రవేశపెట్టడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టిన ఫలితంగా ఇంధన ఖర్చులు భారీగా ఆదా అయ్యాయి.

హాస్టల్ కోసం జేఎన్‌యూ విద్యార్థుల ధర్నా

న్యూదిల్లీ: రెండో సెమిష్టర్ పరీక్షలు దగ్గరపడినప్పటికీ ఇంకా హాస్టల్ గదులు కేటాయించకపోవడంపై దిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. పరీక్షల కోసం భారీగా అద్దె చెల్లిస్తూ బయట గదులు తీసుకోవాల్సి వస్తోందని విమర్శించారు. యూనివర్సిటీలోని విద్యార్థుల కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ధర్నాకు దిగారు. తమ డిమాండ్లు పరిష్కరించేంత వరకూ ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టంచేశారు. విద్యార్థుల సమస్యపై జేఎన్‌యూ పాలకవర్గం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సమాధానం రాలేదు. కార్యాలయం లోపల కూడా తాళాలు వేసినట్లు ఆందోళనకారులు ఆరోపించారు. మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు తీర్చుకోవడానికి సైతం అనుమతివ్వడం లేదని మండిపడ్డారు. సోమవారం సాయంత్రం నుంచి డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఆఫీసు లోపల విద్యార్థులు ధర్నాకు దిగారని, హాస్టల్ కోసం డిమాండ్ చేస్తున్నారని జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఓ ప్రకటనలో తెలిపింది. కొత్త హాస్టల్ బ్యారక్ అప్పగింతలో భారీ జాప్యం జరుగుతుందని విమర్శించింది.

ముస్లిం కోటా రద్దు సమర్ధనీయమే: అమిత్‌షా

బాగల్‌కోట్: కర్నాటకలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దు చేయాలన్న బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం సమర్థించుకున్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లను బీజేపీ ఎప్పటికీ విశ్వసించదని చెప్పుకొచ్చారు. అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తామంటున్న కాంగ్రెస్‌పై అమిత్‌షా ఆరోపణలు చేశారు. 'ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అంటే అవి మత ప్రాతిపదిన ఏర్పాటు చేసిన రిజర్వేషన్లే. ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి చెబుతూ ముస్లిం కోటాను బీజేపీ ప్రభుత్వం రద్దు చేస్తుంది' అని అమిత్‌షా తెలిపారు. బాలకోట్ జిల్లా తర్దాల్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్‌షా ప్రసంగించారు. మతపరమైన రిజర్వేషన్లకు తాము పూర్తి వ్యతిరేకమన్నారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేయడం...ఆ రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీలకు, ఒక్కలిగ, లింగాయత్‌లకు కేటాయిస్తామన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ను 15 శాతం నుంచి 17శాతానికి పెంచాలని బసవరాజ్ బొమ్మై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తమ పార్టీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామన్న కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ హామీని ప్రస్తావిస్తూ...పార్టీలో ఎవరి కోటా రద్దు చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని అమిత్‌షా ప్రశ్నించారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు పునరుద్ధరించి...ఎవరి రిజర్వేషన్లు తగ్గిస్తారని అడిగారు. ఒక్కలిగ లేదా లింగాయత్‌ల రిజర్వేషన్లు తగ్గిస్తారా? దళితులు, గిరిజనులు లేదా వెనుకబడిన తరగతుల రిజర్వేషన్లు తగ్గిస్తారా అని నిలదీశారు.

మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దెదింపాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విజ్ఞప్తి

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: దేశంలో ప్రమాదకర రాజకీయాలు నడుస్తున్నాయని, దీని ప్రభావం ప్రజలపై పడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. మోదీ, జగన్ ప్రభుత్వాలను గద్దె దించడం ద్వారా రాజ్యాంగాన్ని కాపాడుకుందామని పిలుపు నిచ్చారు. జిల్లా కేంద్రంలో నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో రామకృష్ణ విలేకరులతో మంగళవారం మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను రామకృష్ణ ఎండగట్టారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, నల్లధనం వెనక్కి తీసుకురావడం వంటి హామీల ఊసేలేదన్నారు. లక్షల కోట్ల బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి తిరుగుతున్న ప్రధాని మోదీ మిత్రులను ఇప్పటి వరకు అరెస్టు చేయలేదని తూర్పార బట్టారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, కేవలం అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందని విమర్శించారు. ముస్లింల రిజర్వేషన్ల రద్దుపై బీజేపీ పెద్దలు పదేపదే మాట్లాడుతున్నారని, అదే జరిగితే బీజేపీకి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలకు సంబంధించి కోర్టుకు వెళ్లమని స్వయానా అమిత్ షా చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రతిపక్షాలపై సీబీఐ, ఈడీ, ఐటీ దాడులు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు మండి పడ్డారు. కేజ్రీవాల్, సిసోదియా, కల్వకుంట్ల కవిత వంటి అనేక మందిపై ఈడీని ఉసిగొల్పుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కనబడుతోందని, జగన్ సొంతూరు పులివెందులలో పోలీస్ పహారా కొనసాగుతోందని దుయ్య బట్టారు. తల్లీ చెల్లెలను పట్టించుకోని జగన్ రాష్ట్ర ప్రజలకు ఏమి చేస్తారని ప్రశ్నించారు. గన్‌మెన్‌ల కళ్లుగప్పి అవినాశ్‌రెడ్డి కనిపించకుండా పోయినట్లు వార్తలు వస్తున్నాయని చెప్పారు. అధికారం కోసం జగన్...కుటుంబ సభ్యులను, బంధువులను సైతం జైలుకు పంపుతున్నారని విమర్శించారు. జగన్ రాజకీయాలను భ్రష్టు పట్టించారని విరుచుకుపడ్డారు. ఏపీలో సీఎం జగన్, తెలంగాణలో వైఎస్ షర్మిల యావగింపు రాజకీయాలు చేస్తున్నారని, అధికార దాహంతో కుటుంబాన్ని బజారుకీడుస్తున్నారని మండిపడ్డారు. జగన్‌కు ఎస్సీ, ఎస్టీల పట్ల విశ్వాసం లేదని, కడపలో నిజాయతీగల అధికారి డాక్టర్ అచ్చన్నను హత్య చేస్తే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే అచ్చన్న మృతదేహానికి పంచనామా చేశారని ఆరోపించారు. డాక్టర్ హంతకులతో పోలీసులు కుమ్మక్కయ్యారని తీవ్రంగా మండిపడ్డారు. విశాఖలో డా.సుధాకర్ ఉదంతాన్ని గుర్తు చేశారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేస్తున్నా వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీపీఐ అనంతపురం, పుట్టపర్తి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, రామకృష్ణ, కేశవరెడ్డి, రమణ, రాజేశ్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి అల్లీపీరా పాల్గొన్నారు.

పంజాబ్ మాజీ సీఎం ప్రకాశ్‌సింగ్ బాదల్ కన్నుమూత

చండీగఢ్: పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి, శిరోమణి అకాలీదళ్ సీనియర్ నేత ప్రకాశ్ సింగ్ బాదల్ కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన... మంగళవారం రాత్రి 8:28 గంటలకు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. వారం రోజుల క్రితం ప్రకాశ్ సింగ్ బాదల్ అనారోగ్యంతో మొహాలిలోని ఫోర్టిస్ ఆసుపత్రిలో చేరారు. 95 సంవత్సరాల వయస్సున్న ప్రకాశ్ సింగ్ బాదల్... పంజాబ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. ఎన్నికల చరిత్రలో బాదల్ అనేక రికార్డులను తన పేరిట నెలకొల్పారు. 1947 సంవత్సరంలో పంజాబ్‌లోని బాదల్ అనే గ్రామానికి ఆయన సర్పంచ్‌గా గెలిచారు. అప్పట్లో అత్యంత చిన్న వయసులోసర్పంచ్ పదవి చేపట్టిన వ్యక్తిగా బాదల్ రికార్డు సాధించారు. 1970లో పంజాబ్ ముఖ్యమంత్రిగా బాదల్ బాధ్యతలు చేపట్టారు. అప్పుడు ఆయన వయసు 43 ఏళ్లు కాగా... అప్పటివరకు అత్యంత పిన్నవయస్కుడైన సీఎంగా బాదల్ నిలిచారు. 2012లో మరోసారి పంజాబ్ ముఖ్యమంత్రిగా బాదల్ బాధ్యతలుస్వీకరించారు. అప్పుడు ఆయన వయస్సు 84 ఏళ్లు కాగా... సీఎం పదవి చేపట్టిన అత్యంత పెద్దవయస్కునిగా మరో రికార్డు దక్కించుకున్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ప్రకాశ్ సింగ్ బాదల్ 11 సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1997 నుంచి ఆయన లాంబీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పంజాబ్‌కు ఐదుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1995 నుంచి 2008 మధ్య శిరోమణి అకాలీదళ్‌కు అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఒకసారి లోక్‌సభ సభ్యుడిగానూ బాదల్ ఎన్నికయ్యారు. బాదల్ భౌతికకాయాన్ని బుధవారం ఉదయం మొహాలీ నుంచి స్వగ్రామం బాదల్ తీసుకెళతారు.

బీజేపీ తిరిగి అధికారంలోకొస్తే బ్రిటీష్ పాలనే

అరకులోయ సభలో రాఘవులు, జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర- అరకులోయ: కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే బ్రిటిష్ పాలన తప్పదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి హెచ్చరించారు. అరకు లోయలో సీపీఐ, సీపీఎం సంయుక్తంగా నిర్వహించిన మహా ప్రదర్శనలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గిరిజన హక్కులు చట్టాలు కాపాడాలంటూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 14న ముంచంగిపుట్లో ప్రచార భేరి ప్రారంభమైంది. మంగళవారం అరకు లోయలో ముగింపు సభ జరిగింది. ఈ సభలో జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, దేశాన్ని రక్షించాలంటే బీజేపీని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం పై మన గిరిజన ఎమ్మెల్యేలు కనీసం నోరు మెదపకపోవడం విచారకర మన్నారు. జీవో నంబర్ మూడును రద్దుచేసి షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయనీ, గిరిజన ప్రాంతంలో అభివృద్ధి కోసమే రోడ్లు వేస్తున్నామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి కానీ గిరిజన గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్డు సౌకర్యం లేక గిరిజన ప్రాంతంలో గర్భిణి స్త్రీలకు ఆసుపత్రిలో తీసుకువెళ్లాలంటే డోలినే గతి అవుతోందన్నారు.

గిరిజన ప్రాంతాల్లో రహదారులు సిసి రోడ్లు కల్పించి గిరిజనుల ఆరోగ్య భద్రతను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన్యంలో గిరిజనులను అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని బినామీ పేర్లతో రిసార్ట్స్, లాడ్జిలు నిర్మిస్తున్నా ఇక్కడి గిరిజన ప్రజాప్రతినిధులు నోరు మెదపడంలేదనీ, వాటి వెనక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. గిరిజనులను రక్షించాల్సిన పాలకులే గిరిజనులను వెన్నుపోటు పొడుస్తున్నారని, అది ఆసరాగా తీసుకున్న గిరిజనేతరులు కోట్లకు పడగెదు తున్నారని జేవీఎస్ఎన్ మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీవీ రాఘవులు మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ పాలనలో ఆదివాసులకు రాజ్యాంగంలో కల్పించిన అనేక హక్కులకు భంగం కలుగుతోందన్నారు. దేశంలో ఒకే మతం, ఒకే భాష, ఒకే జాతి ఉండాలంటూ మతవిధ్వంసాన్ని సృష్టించడానికి దేవుళ్ల పేరుతో జాతి ఐక్యతను బీజేపీ దెబ్బతిస్తోందన్నారు.దేశంలో హిందువులే ఉండాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ మతాల మధ్య ఘర్షణలు సృష్టిస్తున్నాయన్నారు. దేశ ఐక్యతను దెబ్బతీస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా కలిసొచ్చే పార్టీలన్నీ కలుపుకొని భవిష్యత్తులో పెద్ద ఎత్తున పోరాడుతామని చెప్పారు. పేదల పక్షనా, కష్టజీవులు పక్షాన నిలబడతామని ఎర్రజెండా మీకు భరోసా ఇస్తోందన్నారు. సీపీఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్సయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దీసారి గంగరాజు కూడా మాట్లాడారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ మైదానం నుంచి సభా స్థలి అయిన గిరిజన సంస్కృతిక మ్యూజియం వరకు ర్యాలీ నిర్వహించారు.

లౌకిక, ప్రజాతంత్రశక్తులు ఒకే వేదికపైకి రావాలి: ముప్పాళ్ల

విశాలాంధ్ర-చిలకలూరిపేట: లౌకిక, ప్రజాతంత్రశక్తులు ఒకే వేదికపైకి వచ్చి బీజేపీ, వైసీపీని గద్దెదించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు. మతోన్మాద బీజేపీని సాగనంపుదాం-దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో సీపీఐ, సీపీఎం ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం కళామందిర్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ముప్పాళ్ల మాట్లాడుతూ కేంద్రంలో మోదీ సర్కార్ దేశ సంపదను కొద్దిమంది కుబేరులకు దోచిపెడుతోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తోందన్నారు. వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలు బీజేపీ విషకౌగిలి నుంచి బయటపడాలని హితవుపలికారు. తొమ్మిదేళ్ల పాలనలో బీజేపీ ప్రభుత్వం దేశానికి ఏమి చేసిందని ప్రశ్నించారు. ప్రజల మధ్య చీలిక తేవడం, హిందూ మత ఉన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకోవడం తప్ప ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. ధరల తగ్గింపు, ఉద్యోగాల సృష్టి, రైతు ఆదాయం రెట్టింపు, వెనక్కి తెస్తామన్న నల్లధనం హామీలు అమలు చేయలేదని గుర్తుచేశారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంటులో 175 బిల్లులు ఆమోదిస్తే చేస్తే 100 బిల్లుల వల్ల ప్రజలపై తీవ్రభారం పడిందని తెలిపారు. మోదీ పాలనలో ధనికుడు, పేదల మధ్య వ్యత్యాసం పెరిగిందని, పేదలపై అప్పుల భారం పడనుందని హెచ్చరిం చారు. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, పురుగుమందులు ధరలు పెంచారని తెలిపారు. ప్రత్యేక హోదా విషయం విస్మరించటం వల్ల రాష్ట్రం అన్ని విధాల నష్టపోయిందని వివరించారు. సభకు సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరు రామారావు స్వాగతం పలకగా, సీపీఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఇప్టా జాతీయ కార్యదర్శి షేక్ గని, పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు సుబ్బాయమ్మ, సీపీఎం నాయకులు తోకల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అన్యాయంపై నోరుమెదపని జగన్: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-నరసరావుపేట: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్ కనీసం నోరుమెదపడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేవీవీ ప్రసాద్ విమర్శించారు. ప్రచారభేరిలో భాగంగా మంగళవారం నరసరావుపేట నియోజకవర్గ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విధానాల ఫలితంగా ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తున్నా రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు వైసీపీ, టీడీపీ, జనసేన మోదీ విధానాలను బలపరచడం రాష్ట్రానికి అన్యాయం చేయడమేనన్నారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఐ, సీపీఎం చేస్తున్న పోరాటాన్ని అందరూ బలపరచాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెట్ట డానికి కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభానీ, సీపీఐ పట్టణ కార్యదర్శి వైదాన వెంకట్, సీపీఎం పట్టణ కార్యదర్శి షేక్ సిలార్ మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో ఈ నెల 30వ తేదీన సాయం త్రం ఐదు గంటలకు ఏంజెల్ టాకీస్ సెంటర్లో జరిగే ప్రచార భేరి సభను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి గుండాల శ్రీ హర్ష, అంజి రెడ్డి, కృష్ణ సూరి, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక నేరస్తులకు మోదీ అండ

శ్రీనివాసరావు, ఈశ్వరయ్య

విశాలాంధ్ర-పార్వతీపురం: మోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి శూన్యమని, ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలు రైల్వే, రక్షణ, ఎల్ఐసి, బ్యాంకులు, ఓడరేవులు, వ్యవసాయం కార్పొరేట్ వ్యక్తులైన ఆదానీ, అంబానీలకు ధారాదత్తం చేస్తున్నారని.. గోరక్షణ పేరుతో నిత్యం మైనార్టీలు, దళితులపై దాడులకు తెగబడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. మన్యం జిల్లా గుమ్మ లక్ష్మీపురం లోని కనిగిరి క్లబ్ రోడ్‌లో సీపీఐ, సీపీఎం మంగళవారం నిర్వహిం చిన ప్రచార భేరి కార్యక్రమంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో కోట్లకు పడగలెత్తిన కుబేరులకు తప్ప సామాన్య ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని రైతులు, కార్మికులు, యువకులతో పాటు అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనపై విసిగెత్తిపోయారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్ బీజేపీ ప్రభుత్వానికి మద్దతు పలికి ప్రజలపై భారాలు మోపటమే పనిగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో విభజన చట్టాలు, ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి వంటి సమస్యలపై బీజేపీని నిలదీసే సత్తా లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావుమాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పాలనలో పూర్తిగా వైఫల్యం చెందాయని ప్రజలు వచ్చే ఎన్నికల్లో మోదీ, జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కార్యవర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సీపీఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మథరావు. సహాయ కార్యదర్శి తోటజీవన్న తదితరులు పాల్గొన్నారు.

మోదీని గద్దె దించాల్సిందే

రావుల వెంకయ్య

విశాలాంధ్ర-రాజమండ్రి: దేశంలో మతోన్మాదాన్ని పెంచుతూ మనువాద భావజాలాన్ని పాఠ్యపుస్తకాలలో చేర్చుతున్న నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిందేనని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. మోదీ హఠావో దేశ్ బచావో నినాదంతో సీపీఐ, సీపీఎం అధ్వర్యంలో ప్రచారభేరిలో భాగంగా స్థానిక కోటిపల్లి బస్సు స్టాండ్ వద్ద మంగళవారం బహిరంగ సభ జరిగింది. ఈ సభకు ఉభయ పార్టీల జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, సీపీఎం నాయకులు వి.ఉమామహే శ్వరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారనీ, అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేయడం కోసం కుట్రలు పన్నుతున్నారని ఆయన విమర్శించారు. కార్మిక చట్టాలను సవరించి కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్నారని, ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న చట్టాలను సైతం తొలగించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, సీపీఎం, సీపీఐ నగర కార్యదర్శులు వి.కొండలరావు, బి.పవన్, సీపీఎం నాయకులు బేబిరాణి, జట్ల సంఘం ప్రధాన కార్యదర్శి సప్ప రమణ తదితరులు పాల్గొన్నారు.

మోదీ ప్రభుత్వాన్ని సాగనంపే వరకు పోరు: రామానాయుడు

విశాలాంధ్ర- మదనపల్లి రూరల్: కేంద్రం ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని చిత్తూరు బస్టాండ్ సర్కిల్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, వెంకటేశ్వర్లు, శివా రెడ్డి మాట్లాడుతూ బీజేపీని అధికారం నుంచి తొలగించకపోతే దేశ సమగ్రతకు, ఐక్యతకు ప్రమాదమని, దేశాన్ని కార్పొరేట్లకు పూర్తిగా అమ్మేస్తాడని అన్నారు. జగన్ నవరత్నాల పేరుతో అప్పులు చేసి డబ్బులు పంచుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ నిధులను నవరత్నాలకు మళ్లిస్తున్నారన్నారు. మదనపల్లి ప్రాంతంలో టమోటా రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మహేశ్, కార్యవర్గ సభ్యులు టి.క్రిష్ణప్ప, సాంబ శివ, నియోజక వర్గ కార్యదర్శి కె.మురళి, సీపీఎం జిల్లా నాయకులు శర్మ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయోద్యమ స్ఫూర్తితో ఉద్యమిద్దాం: జంగాల



విశాలాంధ్ర-గుంటూరు: మోదీ-అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ-ఆర్ఎస్ఎస్ కూటమి ప్రజల మధ్య రాజేస్తున్న మత విద్వేషపు చిచ్చుతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, దానిని కాపాడుకోవడానికి ఆనాటి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేరి బహిరంగ సభ గుంటూరు స్వర్ణభారతీ నగర్‌లోని పెట్రోల్ బంక్ వద్ద మంగళవారం రాత్రి జరిగింది. సీపీఎం నాయకులు ఖాశీం అధ్యక్షతన జరిగిన సభలో జంగాల మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి బ్యాంకుల్ని, ప్రభుత్వ రంగ సంస్థలను, ఓడరేవుల్ని ఆఖరికి వ్యవసాయ రంగాన్ని సైతం కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు, సామాన్యులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం వారిపై మోయలేనంత భారాలు వేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మాల్యాద్రి, కె.నళినీకాంత్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యం చేయడానికి పాదయాత్రలు, ప్రచార సభలు నిర్వహిసున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, సీపీఐ నగర కార్యవర్గసభ్యులు ఆకిటి అరుణ్‌కుమార్, చల్లా మరియదాసు, విజయ్‌కుమార్, దేవానాయక్, నూతలపాటి వెంకటేశ్వరరావు, చైతన్య, రామచంద్రుడు, గోగినేని వెంకట్రావు, చేపర్తి కృష్ణారావు, వెంకటరమణ, సీపీఎం నాయకులు ముత్యాలరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిరంకుశ పాలనను వ్యతిరేకించండి: రామాంజనేయులు

విశాలాంధ్ర - ఆత్మకూర్ టౌన్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నంద్యాలజిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏ.రాజశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనపుదాం దేశాన్ని కాపాడుకుందాం అన్న నినాదంతో ప్రచార భేరి ముగింపు సభ మంగళవారం నంద్యాలజిల్లా ఆత్మకూరులోని గౌడ్ సెంటర్లో సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, సీపీఐ తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో ప్రజానాట్యమండలి కళాకారులు, చిన్నారులు పాటలు, సంస్కృత కార్యక్రమాల ద్వారా అలరింప జేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

కేరళలో పది ద్వీపాలు కలిపే తొలి వాటర్ మెట్రో ప్రారంభం

జాతికి అంకితమిచ్చిన ప్రధాని మోదీ

తిరువనంతపురం: దేశంలో మొట్టమొదటి వాటర్ మెట్రో ప్రారంభమైంది. ఇది కేరళలో అందుబాటులోకి వచ్చింది. నీటిపై నడిచే కొచ్చి వాటర్ మెట్రోను ప్రధాని నరేంద్రమోదీ లాంఛనంగా ప్రారంభించారు. ఆపై జాతికి అంతికతమిచ్చారు. కొచ్చి చుట్టు పక్కల ఉండే 10 ద్వీపాలను కలుపుతూ ఈ వాటర్ మెట్రో రాకపోకలు సాగిస్తుంది.ఈ మెట్రోలో బ్యాటరీతో నడిచే 78 ఎలక్ట్రిక్ హైబ్రిడ్ బోట్లు ఉంటాయి. వీటి కోసం 38 టెర్మినళ్లు నిర్మించారు. వాటర్ మెట్రో ప్రాజెక్ట్‌ను రూ. 1,136.83 కోట్లతో చేపట్టారు. కేరళ ప్రభుత్వం, జర్మనీకి చెందిన ఫండింగ్ సంస్థ కేఎఫ్‌డబ్ల్యూ సంయుక్తంగా దీనిని పూర్తి చేశాయి. విద్యుత్‌తో పనిచేస్తుండటంతో పర్యావరణానికి ఎలాంటి హాని కలగించకుండా మెట్రో తయారైంది. ఇందులో దివ్యాంగుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం రోజుకు 12 గంటలు ఈ మెట్రో సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ఇందులో ఏసీ, వైఫై సౌకర్యం ఉంది. ఒక్కో బోటులో 50 నుంచి 100 మంది వరకు ప్రయాణించవచ్చు. గంటకు 15 నుంచి 22 కిలోమీటర్ల వేగంతో ఇవి ప్రయాణిస్తాయి. అత్యాధునిక భద్రత, సమాచార వ్యవస్థ వీటిలో ఉన్నాయి. వాటర్ మెట్రో టికెట్ ప్రారంభ ధర రూ. 20 కాగా, గరిష్ఠ టికెట్ ఖరీదు రూ. 40. టికెట్లతోపాటు పాస్‌ల సౌకర్యాన్ని కూడా కల్పిస్తున్నారు. వారం రోజుల పాస్ కోసం రూ. 180, నెల వారీ పాస్‌కు రూ. 600, మూడు నెలల కోసం రూ.1500 చెల్లించాల్సి ఉంటుంది. మెట్రోను ప్రారంభించిన ప్రధాని మోదీ కేరళలోని మరికొన్ని అభివృద్ధి కార్యక్రమాలకూ శ్రీకారం చుట్టారు. ఆ రాష్ట్రంలోని మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు తిరువనంతపురం నుంచి కాసరగోడ్ వరకు రాకపోకలు సాగిస్తుంది. డిజిటల్ సైన్స్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. దేశంలో కాకుండా దక్షిణాసియాలోనే తొలి వాటర్ మెట్రో ఇదేనని, కేరళ కలల ప్రాజెక్టు నిర్వహణ బాధ్యతలను కొచ్చి మెట్రో రైల్ లిమిటెడ్ చూసుకుంటున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. వాటర్ మెట్రోతో కేరళలో పర్యాటకానికి ఊతం లభిస్తుందని ఆకాంక్షించారు.



తిరుమలలో జగన్ స్టిక్కర్ల వివాదం



విశాలాంధ్ర-తిరుపతి: తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీ నగర్‌లో సోమవారం రాత్రి 'మా నమ్మకం నువ్వే జగన్' పేరుతో చేపట్టిన కార్యక్రమం వివాదాస్ప దంగా మారింది. నివాసాల వద్ద స్థానిక నాయకులు, కార్యకర్తలు ఇళ్లకు జగన్ స్టిక్కర్లు అంటించి వివాదానికి కారణమయ్యారు. సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ సిబ్బంది హుటాహుటిన బాలాజీ నగర్‌కు చేరుకుని ఇళ్లకు అంటించిన స్టిక్కర్లను తొలగించారు. వాస్తవంగా రాజకీయ నాయకుల విగ్రహాలు, ఫోటోలు, జెండాలు, చిహ్నాలు, అన్యమత ప్రచారానికి సంబంధించిన ప్రచార సామాగ్రిని తిరుమలకు అనుమతించరు. వీటిపై ఎన్నో ఏళ్ల క్రితమే నిషేధం ఉంది. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు దీనిని ఉల్లంఘించి ఇళ్లకు జగన్ స్టిక్కర్లు అంటించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఇంత జరుగుతున్నా... టీటీడీ విజిలెన్స్ విభాగం చోద్యం చూస్తోందా?... ప్రచారానికి సంబంధించిన స్టిక్కర్లు, బ్యాగులను అలిపిరి వద్ద ఎలా అనుమతించారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై తిరుమల వీజీఓ బాలిరెడ్డిని వివరణ కోరగా తాము ఎవరికీ తిరుమలకు స్టిక్కర్లు, బ్యాగులు తెచ్చుకోవ డానికి అనుమతి ఇవ్వలేదని, అవి ఎలా వచ్చాయో విచారణ చేస్తామని పేర్కొన్నారు. స్టిక్కర్లు అంటించారనే విషయం తెలిసిన వెంటనే మా సిబ్బంది అక్కడికి చేరుకొని వాటిని తొలగించారని తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.